# సద్గమయంలో

## సతీశ్

జీవితంలో అనుభవాలు తాళం చెవుల లాంటివి. మామూలు తాళంచెవులకీ, వీటికీ చాలా వ్యత్యాసాలున్నా, కొన్ని పోలికలు గూడా ఉన్నయ్. మామూలు తాళంచేతులు, తాళం కని పిస్తే, సాధారణంగా తాళానికి సరిపడ్డవయితేనే పనిచేస్తయ్. ఒక్కొక్కప్పుడు వేరొక తాళానికి గూడా పనిచేయటం కద్దు. కాని జీవితానుభావాలు తీసే తాళాలు, తెరిచే ద్వారాలు, ఆ ద్వారాలున్న గదులు, గదులలో ఉన్న అంధకారం అన్నీ వేరు. ఒక్కొక్క అనుభవంతో, అసలు అక్కడ అంతకుముందు, ఒక గదిగాని, తలుపులుగానీ, దానికి వేసిన తాళంగానీ ఉన్నట్లు అనిపించదు. కాని, ఆ అనుభవంతో తీయబడ్డ తాళాలూ, తెరవబడ్డ ద్వారాలూ, వాటికి లోపలగా గుప్తంగా ఉన్న గదులు, అందులో ఉన్న అంధకారంలోకి మన ఆలోచనారస్మి వెళ్లేటప్పటికే, ఒక్కసారి వెలుగులోనించి చీకట్లోకి వెళ్ళినపుడు కలిగిన అనుభవాలే కలుగుతుంటయ్. సాదృశ్యంగా ఉన్న తాళంచెవులతోటి యింకో తాళాలు వూడివచ్చినట్లు ఒక్కొక్క అనుభవంతో, వేరొక ద్వారం మనకీ, మన ఆలోచనలకీ అందని తాళం తెరుచుకుంటుంది.

ఎక్కడో, ఎవరికోగాని, అసాధారణంగా గాని జరగని సంఘటన, సాధారణంగా జరిగిందని చెప్పుకోవటమేగాని చూడని సంఘటన అతని జీవితంలోనే జరిగింది. ఆ దౌర్భాగ్యుడు, ఆ దురదృష్టవంతుడూ అతనే అయ్యాడు. అతని జీవితంలో దురదృష్టమూ దౌర్భాగ్యమూ రెండూ ఉన్నయ్యో లేదో తెలియనివాళ్లెవరూ, అతను దురదృష్టవంతుడు అని అనుకోలేదు. తన దురదృష్టం ఎంతటిదో అతనూ అనుకోలేదు ఎప్పుడూ. కాని ఆ జరిగిన పెద్ద అనుభవంతో, కొద్దిపాటి జ్ఞానం మాత్రం వచ్చింది. ఆ అనుభవం తెరచిన గుప్త ద్వారంలో నించి లోపలికి వెళ్లి అంధకారమయమైన ఆ గదిలోకి తన ఆలోచనల్ని, తెలివితేటల్ని వెంట తీసుకొని వెళ్లినా, అవి అతనికి పూర్తిగా కావలసినంత కాంతి యివ్వలేకపోయినయ్. కాని పూర్తిగా అంధకారం మాత్రం లేదు.

ఆ సంఘటన జరిగి కూడా చాలా నెలలైంది. అయినా అది అప్పుడే జరిగినట్లు, దానినించి ఎప్పుడూ తేరుకొని, అది మరిచిపోగలిగినట్లు అతనికి అనిపించకపోవటం గూడా జరిగింది. నిజంగా ఎక్కడో కథల్లో జరిగేలాంటిదే. పేపర్లో ఎక్కడో జరిగినట్లు చూసేలాంటిదే అయినా అది జరిగింది. తనకే జరిగింది. అదే ఆశ్చర్యాన్ని కలిగించింది ప్రసాదరావుకి.

మర్నాడు ఆఫీసరు క్యాంపు వెళ్తాడు. అతను అసలే మతిమరుపు మనిషి. హెడ్ గుమాస్తా వెంకటేశ్వర్రావు, నమ్మదగని మనిషి. అది అందరితోపాటు ఆఫీసరుకు కూడా తెలుసు. అందుచేత అతన్ని నమ్మి, ముఖ్యమైన కాగితాలు, డబ్బు కూడా పెట్టే ఆ బీరువా తాళంచెవి అతనికి యివ్వనూ లేదు. తను మరిచిపోయి, వెతుక్కుంటూ యిబ్బంది పడనూ లేదు. ఎప్పుడూ తాళంచెవి మరిచిపోయి యిబ్బందిపడి ఆఖరికి ఎక్కడో దొరికి, బ్రహ్మాండంగా సంతోషించి, హడావుడిగా సగం మరిచిపోయి క్యాంపు వెళుతాడు అతని ఆఫీసరు. కాని, యీమధ్య ఆ చికాకు అంతా సమర్థుడూ, బాధ్యత తెలిసినవాడూ, నమ్మకమైనవాడూ అయిన ప్రసాదరావుకి, అతను సర్వీసులో తక్కువైనా, యిచ్చి తను నిశ్చింతగా, మతిమరుపులేని ప్రసాదరావు అన్నీ అమర్చిపెడితే తేలిగ్గా క్యాంపు వెళ్తాడు. మళ్లీ వచ్చి ప్రమోషను యిస్తాలే అన్నట్లు ప్రసాదరావు వైపు చూసి. అప్పటికే ఒకసారి ప్రసాదరావు నమ్మకం సమర్థత అన్నీ చూశాడు ఆఫీసరు. అయినా తిరిగి వచ్చిన వెంటనే ప్రమోషను యివ్వలేదు. ప్రసాదరావు యీసారి యింకా అతన్ని సంతోషపెట్టాలనుకున్నాడు. అట్లా ఎంతో చేస్తేగాని ప్రమోషను రాదు. ఆవిషయం అతనికి తెలుసు. అయినా, జాగ్రత్త అయినవాడూ, మతిమరుపు లేనివాడూ అయిన ప్రసాదరావుకి గూడా మతిమరుపు వచ్చింది. తాళంచెవి తనకి యివ్వటం రెండోసారే అయినందువల్ల తను అతి జాగ్రత్తకోసం ప్రయత్నించటం వల్ల మతిమరుపు రానేవచ్చింది.

తనకు మతిమరుపు వచ్చిందని, ఆఫీసరు యింకో అరగంటలో బయలుదేరుతా డనగానే జేబులు చూసుకున్న ప్రసాదరావుకి తెలిసి వచ్చింది. ఎప్పుడూ, అన్నీ జేబుల్లోనే ఉంచుకునే అతను, క్రితం రాత్రి సినిమాకు వెళ్తూ అలమారులో పెట్టాడు. ఇంకో అరగంట కంటే టైము లేదు. తక్కినవన్నీ ఆఫీసరు వెళ్లటానికి రెడీగానే ఉన్నయ్. అతను ఇంతకు ముందు ఎప్పుడూ, ఆఫీసరుచేత అసమర్థుడూ, మతిమరుపు మనిషి అనిపించుకోలేదు. ఎప్పుడూ, అనిపించుకోడు. అందులో యిప్పుడు అనిపించుకుంటే, తను అనుకుంటున్న, ఆఫీసరు యిచ్చేటట్లు కనబడ్డ ఆ ప్రమోషను కాస్తా ఆగిపోతుంది.

ఆఫీసరుకు తెలియుట మెందుకు, పది నిమిషాల్లో తిరిగి వచ్చెయ్యవచ్చు కదా అని, ప్రక్క గుమాస్తాతో చెప్పి ఇంకో గుమాస్తా సైకిలు తీసుకుని బయలుదేరాడు. అయినా ఈలోపల ఆఫీసరు పిలుస్తాడేమోననే భయం. బండికి బయలుదేరటానికి అరగంట కంటే టైంలేదు. తను తాళంచెవి మరచిపోయినట్లు ఆఫీసరుకు తెలియగూడదు. తెలిస్తే తనమీద ఉన్న నమ్మకానికి తనకు వచ్చే ప్రమోషనుకూ దెబ్బ. స్టెనో టైపిస్టు కంటె స్టెనోగ్రాఫరుకు యిచ్చే యిరవై రూపాయలు, తనకి

చాలా ఎక్కువే. ఖరవై రూపాయల విలువ అతనికి బాగా తెలుసు.

సైకిలు, ఊపిరాడకుండా గాలిపీలుస్తూనే, త్వరగా తొక్కాడు. పది నిముషాలలో తాళంచెవి తీసుకొని, ఆఫీసరు పిలిచేలోగా వెళ్లిపోవాలి. ఆఫీసరుకు యీ సంగతి తెలియకుండా ఉండేట్లు, తను ఆఫీసరు పిలిచేలోగా తిరిగి వెళ్లగలిగేట్లు చెయ్యమని మనస్సులో భగవంతుని ఎన్నో నమస్కారాలు గూడా పెట్టుకున్నాడు. ఆఫీసరు పిలిచేటప్పటికి తాళంచెవితో హాజరు కాకపోతే, నూరు నోములూ, ఒక్క రంకుతో పోయినట్లు, యింతకుముందు ఉన్న మంచి, సమర్థత అన్నీ ఒక్క నిముషంలో పోతయ్. వాటితోపాటు వస్తుందనే ప్రమోషను గూడా చంకపెట్టుకుపోతయ్. ఆ విషయం అతనికి పూర్తిగా తెలుసు. అసలు ఆఫీసర్లే అంత, ఎంత సమర్ధవంతంగా ఎంత గొడ్డు చాకిరీ చేసినా, ఒక్క తప్పు కనిపిస్తే చాలు, ఆ ఒక్క తప్పుతోటే మిగతాదంతా తుడిచేస్తారు.

అతను ఆయాసంతోటీ, ఆత్రుతతోటీ, మనస్సులో ఉన్న భయ సంకోచాలవల్ల కలిగిన ఉద్వేగంతోటీ తలుపు తట్టాడు. తలుపు వెంటనే తెరుచుకోలేదు.. కొంచెం గట్టిగానే తలుపుమీద కొట్టాడు. దూరంగా ఎక్కడో, ఆఫీసరు తనకోసమే గంట కొట్టినట్లు తను కొట్టిన తలుపు చప్పుడే వినిపించింది. లోపల్నించి 'ఎవరూ' అని సన్నని, కీచుపోతున్న గొంతుక వినిపించింది. అతనికి విపరీతంగా కోపం వచ్చింది. శకుంతలమీద. బాగా కోపంగానే కేకవేశాడు తనే నని చెప్పటానికి. అప్పుడే ఆఫీసరు తనమీద కేకలు వేస్తున్నాడు. తను యింకా యిక్కడే ఉన్నాడు. అయినా తలుపు తెరుచుకోలేదు. శకుంతల యింత మొద్దు ఎందుకయిందా అనుకున్నాడు. తలుపులు పగలతన్నే అంత కోపం వచ్చింది. అయినా తన్నలేదు. అతని దృష్టి ఆఫీసరు మీదికి, ఆఫీసులో బీరువా మీదికీ, దాంట్లో ఉన్న అవసరమైన కాగితాలూ, డబ్బు మీదికీ పోయింది. ఆడబ్బూ, కాగితాలూ లేకపోతే ఆఫీసరు వెళ్లడు, తనకి ప్రమోషను రాదు. తను సమయానికి కనబడకపోతే పోలీసులు వస్తారు తనకోసం. వస్తుందనుకున్న అదృష్టం పోతుంది. అవకాశం 'కోసం, అసూయతో కాచుకొనివున్న వెంకటేశ్వర్రావు శకునిరావు ఆఫీసర్ని బుట్టలో వేసుకోవటానికి ప్రయత్నిస్తాడు.

తలుపు గడియ నిశ్శబ్దంగా ఊడి, తలుపు ఒకటి చిన్నగా తెరుచుకుంటున్నది. నెమ్మదిగా తెరుచుకోబోయే తలుపుని తానే గట్టిగా, త్వరగా నెట్టాడు. శకుంతల ముఖంలో నెత్తురుచుక్క లేకపోవటం, భయంతో పాలిపోవటం గూడా అతను గమనించలేదు. "ఏంచేస్తున్నావ్" అంటూనే అలమారు వైపుకి వెళ్లాడు. అలమారు తీసి తాళంచెవి తీసుకుంటుండగా గదిలోనించి ఎవరో బైటికి పరుగెత్తుతున్నంత వడిగా నడిచి వెళ్తున్నట్లనిపించి వెనక్కి తిరిగి చూశాడు. తలుపుదగ్గర శకుంతల యింకా అట్లాగే నిలబడింది. బైటనించి లోపలికి చొచ్చుకువచ్చే మిట్టమధ్యాహ్నపు వెలుతురులో లోపలినించి బైటికి చొచ్చుకుపోతున్న గోపాలరావు స్పష్టంగా కనిపించాడు.

అతను వెనక్కి పూర్తిగా తిరిగి నిలుచున్నాడు. అతనికి పూర్తిగా అర్థమైంది తలుపు త్వరగా ఎందుకు తెరుచుకోలేదో. నిర్విణ్ణుడైన అతను నిశ్చేష్టితుడై నిలబడిపోయాడు. ఆత్రుతతోనూ, ఆవేశంతోనూ, ఆగ్రహంతోనూ, ఆరాటపడుతున్న అతని మనస్సున, దానికి ఇంకో లోతుగా ఎక్కడో కృంగిపోయిఉన్న హృదయానికో, దేనికో అశనిపాతంలాంటి ఆ ఆఘాతం తగిలింది. తగిలి అతని సర్వావయవాలనీ నిశ్చేష్టితం చేసింది. మనస్సు నిర్విణ్ణమై పోయింది. హృదయం అచేతనమై పోయింది. ఎటు చూస్తున్నా గూడా ఎవరికీ, చివరికి అతనికి గూడా తెలియనంతగా కళ్లకెదురుగా దృష్టి ఉన్నా ఎటో, ఏదో లోకాలని చూస్తున్నట్లు ఉండిపోయాడు.

అచేతనమైన అతని చేతులోనించి, తాళంచెవి జారిపడి, ఆఫీసరు కోసం ఆఫీసులో బీరువా తీయటం మానేసి, అక్కడ తెరవవలసిన ఆ టైములో ప్రసాదరావు ఇంతకుముందు ఎప్పుడూ తీయని, అసలు ప్రసాదరావుకి తన అస్తిత్వం గూడా తెలియకుండా ఉన్న యింకోగది తాళం తెరిచి తన పని అయిపోయినట్లు వూరుకుంది.

ఎక్కడ ఉన్నదో గూడా తెలియకుండా ఉన్న అయోమయంలో నించి మాయామయంలోకి వచ్చి వచ్చి పడ్డాడు. క్రిందపడ్డవెంటనే కీకా అంటూ కీకారణ్యంగా ఉన్న ప్రపంచంలో పడి శిశువు తన అస్తిత్వాన్ని తల్లికి గుర్తుచేసినట్లు, తాళంచెవి ప్రసాదరావుకి కర్తవ్యం నిర్ణయావసరం గల చేతన స్థితిలోకి లాక్కొచ్చింది. ఎదురుగా తల వొంచుకుని నిలబడ్డ శకుంతల, దూరంగా ప్రయాణానికి సిద్ధమై తనకోసం కోపంగా చూస్తున్న ఆఫీసరు, శకుంతలకీ తనకీ మధ్యగా ఉన్న ఖాళీ జాగాలో పడిఉన్న తాళంచెవి, దానికోసం పరుగెత్తుకు వచ్చే పోలీసులు దానికోసమే ఎదురుచూస్తున్న ఆఫీసరూ, అందరూ ఒక్క వరుసలో కనిపించారు.

వంగి తాళంచెవి తీసుకొని, గట్టిగా నిట్టూర్చి, తనకేమీ కానట్టు నిలుచునిఉన్న శకుంతలవైపు చూడకుండా, ఎవరికో ఎందుకో చెబుతున్నట్లు చెప్పాడు. "ఒక అరగంటలో అంతా సర్ది రెడీగా ఉండు. బండి తీసుకొస్తా" అని చెప్పి కర్తవ్య నిర్ణయంచేసి, వేరొక కర్తవ్యం కోసం, కర్తవ్యం తప్ప ఇంకేమీ అప్పుడు లేనట్లు, ఇంతకుముందు ఏవైనా ఉన్నా అవేమీ మిగలనట్లు నడిచి వెళ్లిపోయాడు.

యాంత్రికంగా అక్కడి బాధ్యత నిర్వర్తించి, యిక్కడి బాధ్యత గూడా పూర్తిచేయటానికి బండి తీసుకువచ్చాడు. తను చెప్పినట్లు ఏమీ సర్ది రెడీగా లేదు. సర్దటానికి గూడా క్లుప్తమైన సంసారం కావటంవల్ల, ఏమీ లేదు. అతను వచ్చేటప్పటికి శకుంతల అంతకుముందు నిలుచున్నట్లు గాక, కాస్త గది లోపలిగా, గోడప్రక్కగా ఒదిగి కూర్చొని ఉంది. అతను

న బట్టలూ అవీ సర్దుకోవటం చూసి, ఆమె గూడా లేచి తన బట్టలు తన పెట్టెలోకి సర్దుకుంది. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఒకరు యింకోరి వైపు చూడలేదు. యాంత్రికంగా పనులు చేసేశారు.

అతను బండివాణ్ణి పిలిచి, అవి లోపల పెట్టమని అక్కడికి మూడో యింట్లో ఉన్న ఒక ముసిలాయనకి కొంత డబ్బూ, తాళంచెవి యిచ్చి వచ్చాడు. అతని ప్రశ్నలకి అన్నిటికీ సమాధానం చెప్పలేదు. రెండో యిల్లు తాళం వేసిఉంది. లేకపోతే ఎట్లా ఉండేదో. ఎదటివాళ్లు వేసే ప్రశ్నలకి సమాధానం చెప్పటానికి యిష్టంలేనప్పుడు ఒక చిన్న పద్ధతి ఉంది పని త్వరగా తెముల్చుకోటానికి. వాళ్లు అడిగే మొదటి ప్రశ్నకే ఒకమాట సమాధానం చెప్పటమో, రెండో ప్రశ్న అడిగే లోపల మొదటి దానికే పూర్తిగా వూకట్టటమో చేస్తే కొంత సరిపోతుంది. ఈలోపల మనం వెళ్లిన పనిని గురించి చెప్పి తిరిగి రావచ్చు. అతను అల్లాగే చేశాడు. అద్దె డబ్బు, చిల్లర బాకీలు వగైరా అన్నీ చెప్పి డబ్బు యిచ్చి వచ్చాడు.

బండి స్టేషనుకు పోనివ్వమని తాను ముందుగా నడిచాడు. స్టేషను వూరికి దూరం. అయినా నడుస్తూనే ఉన్నాడు. బండివాడు "మీరు కూడా ఎక్కరాదా బాబూ" అని అన్నాడు. బండి ఒకటి రెండుసార్లు ఆపాడు గూడా. "అక్కర్లేదు, పదవోయ్" అని బండికంటె ముందుగా నడిచాడు. ఒక్కసారి గూడా వెనక్కి తిరిగి చూడలేదు.

స్టేషనులో రైలు వచ్చి ఆగింది. పోర్టరుకి ఆమె సామాను చూపెట్టి, అది ఆడవాళ్ల పెట్టెలో పెట్టమని, తన సామాను మగవాళ్ల పెట్టెలో పెట్టమని పురమాయించి టిక్కెట్టు కొనుక్కురావటానికి ఆడావుడిగా వెళ్లాడు. అతను వెళ్లిన దిక్కుకి ఆమె చూసింది. అతను వెనక్కి తిరిగి చూడలేదు. పోర్టరు కేకతో ఆమె తన సామాను వెంట వెళ్లింది.

బండి బయలుదేరబోతుం దనగా, అతను ఆమె ఎక్కిన పెట్టె దగ్గరికి వచ్చాడు. ఆమె కూర్చున్న చోటుకి ఎదురుగా ఏదో బెడ్డింగు పడేసి ఉంది. మౌనంగా ఆమెవేపు గూడా చూడకుండా, ఆ బెడ్డింగుమీద టిక్కెట్టూ, కొంత డబ్బూ ఉంచాడు. ఆమె వెంటనే తీసుకోలేదు. బండి బయలుదేరింది. తనవైపు చూడని అతనివైపు, బండి యిక కనబడకుండగా చేస్తూ ఉండగా ఒకసారి చూసింది శకుంతల. ప్రక్కవాళ్లు ఎవరో, ఏదో అడుగుతున్నారు. ఆమె సమాధానం చెప్పలేదు. గాలికి ప్రక్కకి ఒరిగే నోట్లూ, వాటితోపాటూ ఉన్న టిక్కెట్టూ ఆమె చేతికి అందిచ్చారు. ఆమె మౌనంగా అందుకొంది.

కొంచెం వింతగా చూస్తూ ఉన్న చుట్టుపక్కల కూర్చున్నవాళ్లు కాస్సేపట్లో, ఎంత ప్రశ్నించినా ఏమీ మాట్లాడని, ఆమె సంగతి వదిలేసి, ఎవరి పనిలో వాళ్లు మునిగిపోయారు. ఆమె అనే మనిషి అసలు ఆ స్టేషనులోనే ఎక్కనట్లుగా భావించేసి.

## 2

ఆతర్వాత రోజుల్లో చాలా జరిగింది. ప్రసాదరావు బెజవాడలో ఇంకో కంపెనీలో, ఉద్యోగంలో ప్రవేశించాడు. అతనికి ఉద్యోగం దొరకటం, దాంట్లో తన సమర్థతని చూపెట్టి, సమర్థుడు అనే పేరు తెచ్చుకోవటం కష్టంకాలేదు. కాని తనకి సమర్థతలేని విషయం గురించి, ఆ విషయంలో సమర్థత అంటే ఏమిటో, ఎట్లా ఉంటుందో అనే విషయాన్ని గురించి ఆలోచించాడు. తెలుసుకోవటానికి దొరికిన పుస్తకమల్లా చదివాడు గూడా.

తన జీవితచరిత్ర సంతటినీ, తన ఆలోచనాంశాన్నీ గూడా పూర్తిగా మార్చివేసిన ఆ సంఘటనవల్ల దానివల్ల వచ్చిన అనుభవంతో , పరిజ్ఞానంతో , తనకి తెలియని, తెలుసుకుందామని ఎప్పుడూ అనిపించని విషయాల్ని గురించి, ఆలోచించసాగాడు. ఆలోచించి తర్కించ ప్రయత్నించాడు. ఆఫీసు—పని—హోటలు—గది—పుస్తకాల మధ్య మాత్రం శరీరం యాంత్రికంగా కావలసినచోట కావలసినవిధంగా పనిచేస్తున్నా, మిగతా సమయాల్లో మనస్సు మాత్రం అతనికి కావలసిన అంశాల్ని వెతుక్కుంటూ ఎటో వెళ్లి విషయసేకరణ చేసి వస్తుండేది. హృదయం దాని స్థానంలో ఉన్నదా, లేదా అని అనిపించేటంత లోపలికి, అగాథంలోకి వెళ్లిపోయింది. కాని దానితో యిప్పుడు అతనికి ఎక్కువగా పని లేకపోవటంవల్ల దాని విషయమై అతనికి ఎక్కువగా గుర్తు తగలలేదు గూడా.

అతన్ని తరచు సమాధానంకోసం వేధిస్తూ ఎప్పుడూ ఆలోచనని వీడకుండా రెండు ప్రశ్నలు ఎదుర్కొంటుండేవి. అందులో మొదటి ప్రశ్న ఆరోజు శకుంతలని తను ఎందుకు చంపివెయ్యలేదు ? కనీసం ఎందుకు ఏమీ చెయ్యలేదు ? తను చదివిన పుస్తకాల్లో అట్లాంటి సందర్భంలో ఆమెనీ, గోపాలరావునీ కలిపిగానీ, విడివిడిగా గానీ చంపటమో, చంపి తనుచచ్చిపోవటమో, లేక చంపలేక తను చచ్చిపోవటమో జరిగేటట్లు, జరిగిఉండవలసినట్లు అంతకంటె జరగటానికి అవకాశం లేనటు ఉంది. కొన్నింటిలో మాత్రం క్షమించి వూరుకున్నట్లు గూడా ఉంది. కాని అది సత్యదూరంగా, అసంగత కల్పనగా అనిపించింది. కాని, తను చంపనూ లేదు, చచ్చిపోనూ లేదు. ఆరోజు అంత గంభీరంగా ఎట్లా ఉండగలిగాడో, అంత స్థైర్యంగా ఎట్లా యాంత్రికంగా పనిచెయ్యగలిగాడో, ఎట్లా నిర్ణయం తీసుకోగలిగాడో గూడా యిప్పుడు తిరిగి పర్యాలోచించటానికి గూడా వీలులేనంత అద్భుతంగా ఉంది.

అతనికి చాలారోజుల ఆలోచన తర్వాత దానికి సమాధానం దొరికింది. దొరికిన సమాధానం సరిగ్గానే ఉంది గూడా. తన బాల్యం, తన జీవితమే దానికి సమాధానం చెప్పింది. తను మధ్యతరగతి అని చెప్పుకొంటూ చెప్పుకోబడుతూ ఉండే బీద తరగతికి చెందినవాడు. ఆ తరగతిలో ఉన్న వాళ్లకి గౌరవంగా

బ్రతకటం ముఖ్యం. ఆ గౌరవం పోకుండా చూసుకోవటం ముఖ్యం. అది పోకుండా చూసుకోవటానికి యింటి గుట్టు ముఖ్యం. తన తండ్రి తెచ్చే కొద్ది సంపాదనతోటి గడవక, చాలక చాల రోజులు రోజంతటికి కలిపి ఒక భోజనమే చేసి గడపవలసి వచ్చేది. చిరగనిది, బజారుకు వేసుకెళ్లటానికి పనికి వచ్చేదీ, ఒక్కటే చొక్కా ఉండేది. జీవితంలో తమ హైన్యం యితరులకి కనబడకుండా ఉండాలనే తాపత్రయం, ఎదురుగా ఉండి నేను మిమ్మల్ని విడిచి ఎట్లా వెళ్లను అని దైన్యంగా చూసే దారిద్ర్యం, ఎట్లా మార్పు వస్తుందో తెలియక పోయినా, మార్పువచ్చే అవకాశాలు ఏవీ కనిపించకపోయినా, ముందెప్పుడో మార్పు వస్తుంది అనే భవిష్యత్తుమీద అర్థంలేని ఆశ, నమ్మకమూ తప్ప ఇంకేమీ ఉండేవికావు. మరొకటి గూడా ఉండేది. అది కర్తవ్యం. భోజనం లేకపోయినా, గుట్టు రట్టు లేకుండా కర్తవ్యం మాత్రం ఎప్పుడూ నెరవేరుస్తూ ఉండేవాళ్లు. తమున్నాలుకీ, తండ్రి సంపాదనకీ అట్లాగే బాధ్యత మీద వేసుకుని బరువుగా కర్తవ్యంలోకి సాగిపోతూ ఉండేవాళ్లు. అదే తమ గౌరవానికి కారణం. ఆ గౌరవం అంటే నలుగురి చేతా మంచి అనిపించుకోవటం ఎవ్వరిచేతా వేలెత్తి చూపించు కునేట్లు ఉండకపోవటం. దానివల్ల ఏమీ కలిసిరాకపోయినా అది లేకపోయినందువల్ల వచ్చే నష్టాలు ఎక్కువగా తెలిసిన వాళ్లు గనుక దానికోసమే ప్రాకులాడుతూ ఉండేవాళ్లు.

తండ్రి మిగతావాటి అన్నిటితోపాటు తనకు సంక్రమింప చేసింది, బాధ్యత, కర్తవ్యం యీ రెండూ. వాటిని ఆధారం చేసుకొని గౌరవం తెచ్చుకోవటం. తండ్రి అవే నేర్పాడు. తండ్రి దగ్గర్నించి, చూసి అవి నేర్చుకున్నాడు. వాటికి తండ్రికి మనస్సులో ధన్యవాదాలు చెప్పాడు. వాటితోనే జాగ్రతా బజారునపడ్డ గౌరవం ప్రతిష్టల్ని లోపలికి యీడ్చుకొనివచ్చి కాపాడుకున్నాడు. చిన్నప్పటినించీ అయిన అలవాటువల్లనే ఆరోజు అంత స్థైర్యంగా ఉండగలిగాడు. యాంత్రికంగా పనిచెయ్య గలిగాడు.

కాని ఆ సంఘటన తలుచుకున్నప్పుడల్లా ఇప్పుడు ఉద్రేకం వస్తున్నది. అప్పుడు మనస్సు అచేతనమై పోయింది. ఎందుకో అర్థంకాలేదు. ఇటీవలనే తను తెలుసుకున్న మనస్సు, హృదయం అనే రెండింటినీ గురించి కూడా అప్పుడప్పుడూ ఆలోచిస్తు న్నాడు. ఇంతకుముందు అవి లేవని కాదు. ఇంతగా తెలిసి లేవు. అనూహ్యమైన ఆ అఘాతానికి తట్టుకోలేకనో, లేక ఆ కర్కశా ఘాతం, అన్యచింతలో ఉండగా తగలడం చేతనో లేక ఆఫీసరూ, ప్రమోషనుతోనూ నిండిన అన్యచింతనో, తగిలిన అఘాతపు తాకుడుకు జరిగిన సంఘర్షణ వల్లనో, ఎందుచేత వచ్చిందో గూడా మనస్సుకి అప్పుడు ఆ జడత్వం యిప్పటికి ఎంత ఆలోచించినా నిర్దిష్టమైన సమాధానం రాలేదు. దీని విషయమై తను ఎక్కువ కృషి కూడా చెయ్యలేదు.

అతన్ని పట్టుకొని పీడిస్తున్న మరొక సందేహం, శకుంతల అట్లా ఎందుకు చేసింది ? ఎన్నాళ్లనించి చేస్తున్నది? తన కళ్లు ఎందుకు మూసుకుపోయినయ్ ? ఆఫీసు పనిలో నైపుణ్యం, సమర్థత ప్రదర్శించే తను ఎందుకు గ్రహించ లేకపోయాడు. అతనికి దానికీ ఒక రకమైన సమాధానం దొరికింది. తన జీవిత దృక్పథమే వేరు ? తన వూహలే వేరు చిన్నతనంనించీ తను గుట్టుగా అనుభవించిన దారిద్ర్యం నించి దూరం కావటానికీ కృషి చేశాడు. తన కుటుంబాన్ని ఆ దారిద్ర్య బాధనించి కాస్త తేరుకోవటానికి అవకాశం కల్పించే లాగా ప్రయత్నం చేశాడు. దానికోసమే కష్టించి పని చేశాడు. నిజానికి కొంత ఫలితం పొందాడు గూడా. తనూ, తన కుటుంబం యిప్పుడు యిబ్బంది పడటంలేదు. తను సంపాదించే సంపాదనలో దాదాపు సగానికి సగం పంపి తండ్రికి సాయపడుతున్నాడు. అయినా శకుంతల గానీ, తనుగానీ జీవితావసరాలకు ఎప్పుడూ యిబ్బంది పడలేదు. తన దగ్గర పొదుపు జాగ్రత్త రెండూ ఉన్నయ్. శకుంతల దగ్గర అవి కాస్త తక్కువ. తను ఆ విషయం తెలియచెప్పటానికి ప్రయత్నం చేశాడు. శకుంతల నేర్చుకోవటానికి ప్రయత్నించేటట్లే కనిపించేది. అయినా నేర్చుకోలేక పోయింది. ఆమెగూడా జీవితావసరాలను మించిన అవసరాలు ఉన్నయ్యని ఎప్పుడూ చెప్పనూ లేదు. అందుచేత శకుంతలని తను కట్టుబడ్డ జీవిత నియమాలకు, ఆదర్శాలకూ అవసరంగా పూర్తిగా, మార్చే అవకాశం గాని, పూర్తి అవసరంగాని అతనికి కనబడలేదు.

తన ప్రశ్నకి సమాధానంకోసం శకుంతలతో తన మొట్టమొదటి పరిచయం నుంచీ, ఆ సంఘటన జరిగేవరకు గడచిన రెండు సంవత్సరాల వైవాహిక జీవితం అంతా వెతికాడు. గాలించాడు కూడా. శకుంతలని తను మొట్టమొదట పెళ్లిచూపులు చూడటానికి వెళ్లినప్పుడు చూశాడు. శకుంతల తనకు నచ్చినట్లు ఏమీ కనబడలేదు. తన దృష్టి తనకు కాబోయే భార్య ఎట్లా ఉంటే నచ్చుతుందో అనే విషయంమీదికి వెళ్లలేదు. తన ఉద్యోగం, వ్యక్తిగతమైన వినయవిధేయతలూ, కుటుంబ మర్యాద చూసి వచ్చిన, శకుంతల వాళ్ల నాన్న యిస్తామన్న కట్నం మాత్రం నచ్చింది. కొంచెం డబ్బు ఎక్కువ మొత్తంగా అవసరంగా ఉండి, అంత మొత్తం యిచ్చేవాళ్లు తక్కువ అనే విషయం తెలిసిన తన తండ్రికీ, తనకీ గూడా శకుంతలా వాళ్ల తండ్రి ఔదార్యం మంచితనం, యిస్తామన్న డబ్బుతో పాటు బాగా నచ్చినయ్. అందుచేత శకుంతల గూడా నచ్చింది. అతనికి అప్పుడు తోచలేదు, యిప్పుడు తోచింది. శకుంతలకి తను నచ్చాడో లేదోనని ! అప్పుడు కనుక్కొండే అవకాశం కల్పించేదాకా సమాజం మారలేదు. నచ్చకపోతే ఎందుకు చేసుకుంటుంది. తనలో ఏం నచ్చిందో ఎప్పుడూ అడగలేదు. తనకు శకుంతలలో ఏం నచ్చిందో ఎప్పుడూ చెప్పలేదు గనుక. కాని యిప్పు డర్థమైంది శకుంతలకి తను నచ్చాడో లేదో. ఇప్పుడు అడగక్కర్లేదు. అడగకుండానే తెలిసింది.

శకుంతలని తను ప్రేమించాడు గూడా. ఆ విషయం తనకి చాలాకాలం క్రితమే తెలుసు. శకుంతలా వాళ్లు యిచ్చిన కట్నంలో ఎక్కువగా ఖర్చుపెట్టకుండా, చాలా కష్టంతో తన పెళ్లి ముగించి వెంటనే తన చెల్లెలి పెళ్లి గూడా

చేశాడు తండ్రి. దాంతో భాధ్యత గూడా తీరింది. తీరదు అనుకున్న బరువుతోపాటు. తనకు చాలా సంతోషమైంది. శకుంతలా వాళ్ళ ఆ కట్నం యివ్వకపోతే, యింత కట్నం యిచ్చాం సొమ్మేం పెడతారు అని అడిగిఉన్నట్లయితే చెల్లెలి పెళ్లి అయిఉండేదికాదు. శకుంతల గూడా ఎప్పుడూ ఆ విషయం ప్రస్తావించనూ లేదు. తనకు సొమ్ము పెట్టలేదని బాధ పడ్డట్లు గూడా కనిపించలేదు. తనకి సొమ్ము పెట్టకుండా ఆ డబ్బుతో చెల్లెలి పెళ్లి చేశారని మాటవరసకైనా దెప్పి పొడవనూ లేదు. అతనికి రెట్టింపు సంతోషం అయింది. తనకి ఎప్పుడూ సుఖం చేకూర్చటానికే ప్రయత్నిస్తున్నట్లు కనబడేది. తను ఆఫీసరు వదలక యింటికి ఆలస్యంగా వస్తే బాధ పడేది వేళకు తిండీ, తిప్పలు గూడా అమరటంలేదని. అతనికి యివన్నీ గుర్తు ఉన్నయ్. అతనికి శకుంతలమీద నిజంగానే ప్రేమ ఉన్నట్లు అనిపించింది.

ఆమెకు గూడా తనమీద ప్రేమ ఉన్నట్లు కనిపించింది. అదంతా అప్పుడు అనుకునేవాడు. ఇప్పుడు అర్థమైంది. ఆమె ప్రేమ ఎటువైపు ఉన్నదో, ఆమె దృష్టి ఎటువైపు లగ్నమైందో. అసలు ఆరోజైనా అకస్మాత్తుగా బైటపడింది గాని, అసలు ఎన్ని రోజుల నుంచి జరుగుతున్నదో ఆ నాటకం ? ఎన్ని రోజుల క్రితమే తన పరువు తీసిందో, బజార్లో ఎప్పుడు పడేసిందో, తనకి తెలియదు. తను వూహించలేదు. ఎవరూ చెప్పలేదు. తను గ్రహించలేదు.

అతను జీవితంలో మొదటిసారిగా శకుంతల అట్లా చెయ్యటానికి గల కారణాలు ఏమిటి ? తనలో లేనిదీ, గోపాలరావులో ఉన్నదీ ఏమిటో ఆలోచించటం మొదలుపెట్టాడు.

## 3

అతనికి తెలిసింది. తను అసమర్థుడూ, అప్రయోజకుడూ, దరిద్రుడూ, ఒట్టి వాజమ్మ. తనకి ఉంగరాల జుట్టు లేదు. విశాలమైన ఛాతీ లేదు. అది బైటికి కనపడేట్లు చెయ్యటానికి అవసరమై ఒక్కటే యాభై రూపాయల దాకా మింగేదిగా ఉండే టెరలిన్ షర్టు లేదు. ఆడవాళ్ళ ఎదురుగా కూర్చుని, తీరిగ్గా జీవితమంతా చెయ్యవలసిన పని అదే అయినట్లు, అదే ఆనందంగా చేస్తున్నట్లుగా మాట్లాడేటంత తీరికా, సావకాశమూ లేవు. తనదగ్గర నిత్య దారిద్ర్యమూ, కర్తవ్యమూ, బాధ్యత, విశ్వాసమూ, భవిష్యత్తు మీద ఆశ, భవిష్యత్తులో ఉండే అవసరాల జ్ఞానం, దానికి కావలసిన పొదుపు, జాగ్రత్త యివన్నీ ఉన్నయ్. కాని యివేవీ శకుంతలకు పనికిరాకపోయినయ్. అక్కర్లేకపోయినయ్.

శకుంతల వీటన్నిటిని గురించి ఎప్పుడైనా ఆలోచించి ఉంటుందా అనిపించింది. తను శకుంతలని గురించి, శకుంతల యీవిధంగా చేస్తుందనే దాని అవకాశాల్ని గురించీ ఆలోచించ లేదు. శకుంతల వీటిని గురించి ఎప్పుడూ ఆలోచించి ఉండదు.

తను యీ ఏకాంత నిరామయ జీవితంలో చాలా పుస్తకాలు చదివాడు. ఆడవాళ్ళు అట్లా ఎందుకు చేస్తారో, శకుంతలలు ఎందుకు అవుతారో అనేదాన్ని తెలుసుకుందామని. కొంత ప్రత్యక్షానుభవంతో తెలిసింది. కొంత పుస్తకాలలో అర్థమైంది. మరికొంత అర్థంకాదు. ఆ అర్థంకానిది ఎప్పటికీ అర్థంకాదనిపించింది. మరికొంత గాదు యింకెంతో తెలుసుకోవలసినది ఉన్నది అనిపించింది. అప్పుడు ఇంకా ప్రయత్నం చెయ్యకుండా, తెలివిగా తెలిసిన దాన్ని అర్థమైనదాన్నీ క్రోడీకరించుకున్నాడు.

ఆడవాళ్ళకు సువ్యవస్థితమైన, గౌరవమైన కుటుంబ జీవితంమీద కంటే మనస్సుని ఉద్రేకపరిచే, తాత్కాలిక అనుభవాలమీద ప్రేమ ఎక్కువ. ఆ అనుభవాల కోసం అర్రులుచాచి వాటి అనుభూతులు పొందటంలో మగవాళ్ళ కంటె ఒక్క మెట్టు పైగా ఉంటారు. ఆ అనుభవం కోసం వాళ్ళు తమ మీద ఉంచిన విశ్వాసాన్ని గూడా మిగతా గౌరవాభిమానాలతో పాటు, నిస్సంకోచంగా ఏకాంతంలో ఉక్కగా ఉన్నప్పుడు పైబట్ట తీసిపారేసేటంత తేలిగ్గా తీసి పారేస్తారు. ఆ ఉద్రేకంతో తమకే సిగ్గు కలిగించేటంతగా ఉండే నగ్నత, బయటివాళ్ల దృష్టిలో కనిపించే న్యూనత, యీ రెంటినీ గూడా మరిచిపోవటానికి వీలులేని జీవిత వాస్తవికత, వీటిని గురించి ఎప్పుడూ ఆలోచించరు. ఆలోచన వచ్చినా గుప్తంగా ఉంచుతున్నాం, యీ విషయం బైటవాళ్ళకి ఎట్లా తెలుస్తుంది అనే ధైర్యమైన సమాధానం క్రింద కప్పేసి, ఆ అనుభవంకోసం కనిపించే అవకాశాల వెంట పరుగెత్తుతూనే ఉంటారు.

అందుకే తను ఉంచిన విశ్వాసాన్ని శకుంతల తోసేసింది. తన ప్రేమని తన్ని పారేసింది. కామానికి, మోహానికీ దూరమైన పరస్పర సానుభూతితో ఉద్భవించి ఏ దెబ్బలకీ చెడకుండా ఉండే తన స్వచ్ఛమైన ప్రేమ, తన్నిపారేసింది. బాధ్యతలులేని వాళ్లలాగా, కేవలం జీవితంలో ఆనందం అనుభవించటానికే పుట్టాము, ఆ ఆనందం ఎక్కడ దొరుకుతుందో చూసుకోవటం, దాన్ని పొందటం కోసం చేసే ప్రయత్నమే జీవిత పరమార్థం, పొందటమే సార్థకత అని అనుకోవటానికి, అనుకొని అట్లా ఉండటానికి తనకి అవకాశం లేదు. తను పుట్టి జీవిస్తున్న తరగతిలో ఉన్న మరి ఎవ్వరికీ అవకాశం లేదు. వాళ్లలో ప్రతివారికీ బాధ్యతలు ఎక్కువ, జీవితంలో అవకాశాలు, కాలమూ తక్కువ. వాళ్ల భార్యలు అట్లాంటి వాళ్ల జీవితంతో ముడిపడలేరు. వాళ్ళు గూడా ఆ తరగతిలో నించే వస్తారు. ఆ అసంతృప్తికరమైన వాతావరణంలోనే పుట్టి పెరుగుతారు. కాని మొగుళ్ల దగ్గరకు వెళ్లిన వెంటనే, తాము అప్పటిదాకా పెరిగిన అసంతృప్త జీవితాల్లోనించి, తృప్తి ఆనందంలో పడి, ఒక్కసారిగా గాలిలో తేలిపోయి, వనసీమల్లో విహరించే ఆనందమయమైన జీవితం ఉంటుందని, వీలువెంట చూసే సినిమాలలోనించీ, తరచుగా చూసే పత్రికలలో బొమ్మలలో ఉండే సన్నివేశాలు చూసీ భవిష్యత్తులో గనుక వాస్తవికతకు దూరంగా ఉండే ఊహామందిరాలు కట్టుకుని, దాంట్లోనించి ఎకాఎకి శోభనపు గదుల్లోకి అడుగు పెడ్తారు. మళ్లీ ఆ వాస్తవికతను గుర్తుచేసే అత్తవారిళ్లకు వస్తారు. అక్కడా అసంతృప్తి బ్రతుకే అయ్యేటప్పటికి, ఆ సంఘర్షణకి తట్టుకోలేక, తృప్తికోసం ప్రాకులాడుతారేమో ననిపించింది.

ఈ ఊహలతోనే ఉండే అతనికి ప్రతి స్త్రీ ఆ తృప్తి కోసం వెతుక్కుంటున్నట్లు, అవకాశం కోసం ఎదురు చూస్తున్నట్లు కనిపించేది. అతను ప్రతి స్త్రీని చూచినప్పుడల్లా మొగుళ్లు యిచ్చినది, బరువుగా కనిపించేది, పెద్ద అవసరం ఉన్నట్లు కనిపించినది, జార్చేసినా యిబ్బంది లేదు అనిపించేది అయిన విశ్వాసాన్ని వీథిలోకి తెచ్చి, అది పుచ్చుకొని తృప్తి యివ్వగలిగిన ధార్మికుల కోసం వీథిలో నిలబడి ఉన్నారా అనుకునేవాడు. అనుకొని అనుకొని, ఆ నిర్ణయానికి వచ్చేశాడు, వాళ్లు అంటే అందుకోసమే నిలబడి ఉన్నారు అని.

అధార్మికులు గూడా అతనికి తరుచు కనిపిస్తూనే ఉన్నారు. శకుంతలలకి కొదవలేనంతవరకూ, గోపాలరావులకి కొదవ ఎందుకుంటుంది. శకుంతలలు లేకపోతే గోపాలరావుల అవసరంలేదు. శకుంతలలు ఉన్నంతవరకు ఒక్కొక్క శకుంతలకు ఎంతోమంది గోపాలరావులు. ఉన్న తీరికతోటి జుట్టు నొక్కులు తిప్పి, తను సంపాదించే డబ్బుతో, తనకి కష్టంఏమిటో తెలియకుండా వచ్చిన, తనకు అవసరమైనదానికంటె ఎక్కువగా ఉన్న డబ్బుతో పౌష్టవమైన శరీరాలు పెంచి, వాటిని చక్కగా కనిపించేలాగ కప్పి. బాధ్యతా రహితంగా, ఉత్సాహకరంగా బజార్లవెంట, అందులో శకుంతలలు ఉన్న బజార్లవెంట యీడ్చుకొంటూ, ఆశలకీ, గౌరవాలకీ మధ్యగా సతమతమౌతూ, వాటికి ఎదురుగా ఉన్న గాజుగోడలోనించి రెండవవైపు కనిపించే, తృప్తి ఆకర్షణవేపు అదేధ్యానంతో చూస్తూ అసంతృప్తితో జీవితాలు గడుపుతూ ఉండే శకుంతలలని, మీకు తృప్తికావాలంటే ఆ గోడ ఛేదించివెయ్యి, యిది చక్కని అవకాశం అనిచూపెడ్తూ, ఆ అవకాశాలు కల్పిస్తూ తిరుగుతూ ఉంటారు. వాళ్ళతప్పు అంతగాలేదు.

ఆ ఆశాప్రలోభంలో, ఉన్న శకుంతలను, ఊహాజన్యమైన మధురానుభూతుల వాస్తవిక స్వరూపం, దానిలో తృప్తికోసం కాంక్షించే శకుంతలకు, మొగుళ్లు తమమీదకప్పి నిశ్చింతగా కుటుంబబాధ్యత మీదవేసుకొని వెళ్ళినతరువాత, ఆ కప్పిన విశ్వాసం ఆనేది ముతకదుప్పటిలాగా, అనాగరక చిహ్నంలాగా, అనవసరమైన పాతకోటులాగా, కనిపిస్తుంది. బైట మొగుళ్ళు ఏం చేస్తున్నారో ఎవరికి తెలుసు, అవి స్వంతానికి చెప్పుకునే ధైర్యమైన సమాధానాలతోటి గుట్టుగా ఉంటే ఎవరికి తెలుస్తుంది, ఆనేవివేకం అడ్డువేసుకునే ధీమాతోటి ముతకదుప్పటి అనుకున్న విశ్వాసాన్ని పారేసి, తృప్తి, తెచ్చుకొని సంతోషపడుతారు.

వాళ్ల దృష్టిలో ఆ ఉంగరాలజుట్టు, విశాలమైన ఛాతీ, అది కనిపించేట్లు కప్పే ఖరీదైన చొక్కాలు, విలాసాలకు డబ్బు, విలాసాలకోసం సమయం ఉన్నవాళ్ళుతప్ప మిగతావాళ్ళు మనుష్యులుకారు. ఒకవేళ అయినా తృప్తిని యివ్వటానికి పనికిరారు. అందుచేత మొగుళ్ళుగా ఉండటానికి అనర్హులు. అల్లాంటి అనర్హులు భార్యల్ని చేసుకోవటం అనవసరం. చేసుకున్నా తన అనర్హతలుతెలిసి ప్రవర్తించాలి. అట్లాచేస్తే కాస్త దయచేసి వండి, వార్చిపెడతారు.

ఇవే ప్రసాదరావుకి ఆడవాళ్ళని గురించి స్థిరపడ్డ ఊహలు. ఆ ఊహలతో ఆఖరిసారి తన జీవితం మళ్ళీ కొలిచి చూసుకున్నాడు. తను అనర్హుడు. అసమర్థుడు. అప్రయోజకుడూ గూడా. తను విసుగులేని గడియారం, జీవితంలో ఆనందం ఎరుగని అరసికుడు. తను మొగుడుగా ఉండటానికి గానీ, లేక తృప్తి నివ్వటానికిగాని దేనికీ పనికిరాడు. అదే శకుంతల తనకు ప్రత్యక్షంగా చూపెట్టింది. ప్రతి శకుంతలా ప్రతి ప్రసాదరావుకీ చూపెడుతుంది ప్రత్యక్షంగానో పరోక్షంగానో. ప్రతి ఆడదీ ఒక శకుంతల. ఎక్కువ పనీపాటా లేకుండా, యిబ్బందీ కష్టమూ తెలియకుండా, గోముగాను నునుపుగా శరీరాన్ని పెంచి, పై మెరుపులేతప్ప మిగతావేవీ గ్రహించని, బాధ్యత, వివేకం, విచక్షణలేని పనులుచేసే ఆకర్షణీయమైన వింత మృగం. మగవాళ్ళ బలహీనతని సూచించే కొలతబద్ద, వాళ్ళని కష్టపెట్టే, మోసపుచ్చే, మాయలేడి.

అతనిలో ఆద్వేషం, పదేపదే తర్కించటంవల్ల మారకుండా నిలిచిపోయిన ఊహలూ, అతని ఏకాంతజీవితంలో ప్రశాంతంగాలేని మనస్సులో కరుడుకట్టుకుపోయినయ్. అతను ఆజీవితానికి ఆ ఊహలకి అలవాటుపడి అప్పటికే సంవత్సరం అయింది.

## 4

ఈ రోజులోనే అతనితో వాళ్ళ ఆఫీసులోనే పని చేస్తున్న నిర్మల తనతో పరిచయం కలుగచేసుకోవాలని ప్రయత్నం చేస్తున్నట్లు అతనికి అనిపించింది. అతనెప్పుడూ నిర్మలతో పరిచయం కలుగచేసుకోవటానికి ప్రయత్నంచెయ్యలేదు. ఎవ్వరితోనూ అతను పరిచయం కలుగచేసుకోవటానికి ప్రయత్నించలేదు. అందర్నీ చూసినట్లే యాదాలాభంగా నిర్మలవేపు గూడా చూసేవాడు. అంతే— చూసినప్పుడల్లా అతనికి శకుంతలే గుర్తుకువచ్చేది. శకుంతలే అక్కడ కనిపించేది. అతనికి అసహ్యం వేసేది. ఈ శకుంతలగూడా మరొక ప్రసాదరావుని మోసం చేస్తుంది. అనర్హుడని పూర్తిగా తెలిసినాగూడా ఏ ప్రసాదరావునో కట్టుకుంటుంది. అతను భరోసాలో ఉంచిన విశ్వాసాన్ని, అక్కర్లేని పాతకోటుయిచ్చి, యితడిగిరిటె పుచ్చుకునేట్లు ఏ గోపాలరావుకో యిచ్చి, అతనిదగ్గర ఉన్నదీ, అతను ఒక్కడే యివ్వగలడు అనుకునేతృప్తి పుచ్చుకుంటుంది. ఏ ప్రసాదరావు బ్రతుకులోనో నిప్పులుపోస్తుంది. అతని గౌరవం ప్రతిష్ట, గదితుడిచి వీథిలో పారేసినంత తేలిగ్గా బైటపారేస్తుంది. తృప్తి నివ్వటానికితప్ప బాధ్యత పుచ్చుకోవటానికి నేనుకాదు అనేలాంటి గోపాలరావుల్ని పెళ్ళిచేసుకోక, చేసుకోలేక, ఆ గోపాలరావులు దొరక్క, తెలివితక్కువవాడూ, అమాయకుడూ అయిన ఏ ప్రసాదరావునో చేసుకొని వాడితల కొట్టివేయించేస్తుంది. ఆ ప్రసాదరావు మనస్సుని, అతను దేనికోసం

బ్రతుకుతున్నాడో ఆ బాధ్యతనీ, ఆ బాధ్యతకి అవసరమయ్యే అతని గౌరవాన్ని ఎప్పుడూ అర్థంచేసుకోలేదు. చేసుకుందామని ప్రయత్నించదు.

నిర్మల తను రాకముందునించి ఆ ఆఫీసులో పనిచేస్తున్నది. అతను ఆఫీసులో ఎవరెవరు ఎప్పుడుచేరారు వాళ్ళ భోగట్టాలు ఏమిటో ఎప్పుడూ కనుక్కోవటానికి ప్రయత్నించలేదు. తనబాధలో తాను ఉన్నాడు. జీవితం బాధ్యతగనుక, జీవితంకోసం, బాధ్యతకోసం, మళ్ళీ వెంటనే ఉద్యోగంలో చేరాడు. ఎవ్వరికీ ఏ విషయం తెలియకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో, క్రొత్తచోట, క్రమబద్ధమైన జీవితంలో బాధకొంత ఉపశమిస్తుంది అని అతని తండ్రిగూడా చాలా సంతోషించారు, అతను మళ్ళీ వెంటనే ఉద్యోగంలో చేరటంచూసి తనే ఏదో, విధంగా సర్దుకుపోతానని, డబ్బుపూర్తిగా తననే వాడుకొమ్మనీ దారిద్ర్యం, దానివల్లవచ్చే, అవమానం నిరాశ వీటిని దిగమింగినట్లు, యిప్పటిబాధ దిగమింగటానికి వీలులేంది కనుక మరిచిపోవటానికి ప్రయత్నించమనీ, దానికి అవసరమైన వాతావరణం సృష్టించుకొమ్మనీ వ్రాశారు. ఆయన సలహా ఎప్పుడూ స్పష్టమైన మాటల్లో ఉండదు. కానితనకి దానిఅర్థం గ్రాహ్యమే. తన తండ్రి వివేకవంతుడు. అందుచే తనే కొద్ది సంపాదనతో పెద్దకుటుంబాన్ని నిర్వహించుకొచ్చారు. ఆ బాధ్యత అర్థమైన తను భరించరాని ఆ బాధని దిగమింగటానికే ప్రయత్నించి తండ్రికి డబ్బుపంపుతూనే ఉన్నాడు.

తన పనేమిటో తను చూసుకుంటూ, పనిలేకపోతే ఏదో ఒక పుస్తకం చదువుకుంటూ ఆఫీసులో గడుపుతాడు. ఎవ్వరితోనూ పలకరిస్తేతప్ప మాట్లాడడు. మాట్లాడితే అవసరమైనంతవరకు ముక్తసరిగా మాట్లాడుతారు. ఆఫీసులో కాస్త వయస్సుమళ్ళిన వ్యక్తులు గంభీరమైనవ్యక్తి అనుకున్నారు. కాస్త కుర్రకారు మాత్రం ఆఫీసరు స్టైనోగనుక టెక్కు అనుకున్నారు. అతనికి ఎవరేమనుకుంటున్నారు అనే ఆలోచన ఎప్పుడూలేదు. ఏదైనా జరిగినప్పుడు మాత్రం ఎవరేమనుకుంటారో అనిమాత్రం ఉంటుంది. అందుచేతనే ఎవరూ చెడ్డగా ఏమీ అనుకునేట్లు ప్రవర్తించడు.

నిర్మల వాళ్ళఆఫీసులో టైపిస్టు. అక్కడ అందరికీ పనికాస్త ఎక్కువగానే ఉంటుంది. ఐదుగంటల తర్వాతగూడా తప్పనిసరిగా ఉండవలసిన వాళ్ళుతనూ, హెడ్‌గుమాస్తా, నిర్మలకి గూడా తరచుగా ఉండవలసిన అవసరం వస్తూ ఉంటుంది. ఆమె కలుపుగోలు మనిషి. మగవాళ్ళతో కలిసి పనిచెయ్యటానికి, ఒంటరిగా ఉండటానికి అలవాటుపడింది గనుక మగవాళ్ళమధ్య తిరగ నేర్చని పిల్లలకుండే అనవసరపుసిగ్గూ సంకోచాలులేవు. అవసరమైనంతవరకు నిస్సంకోచంగా మాట్లాడుతుంది. కలుపుగోలుగా ఉందని ఎవరైనా చనువు తనుయిచ్చిన దానికంటే ఎక్కువగా తీసుకోవటానికి ప్రయత్నిస్తే దానిఫలితం వాళ్ళకి వెంటనే తెలిసివస్తుంది. ఆ ఫలితం తెలిసివచ్చినవాళ్ళు ఆఫీసులో యిప్పుడు ఎవ్వరూలేరు. వాళ్ళ తర్వాత ఆఫీసులో పనిచెయ్యటానికి రావటానికి అవకాశంలేకుండా పోయింది. ఆ యిద్దరు మిగతా వాళ్ళకి నిర్మలఅంటే పూర్తిగా అర్థమైంది. ఎప్పుడూ ఊహించని భయం యింతకుముందులేని సంకోచం వాళ్ళకి యిప్పుడు, ఆమెతో వ్యవహరించవలసి వచ్చినప్పుడు, ఆప్తమిత్రులులాగా వచ్చి ప్రక్కన నిలచుటకు. అయినా నిర్మల కలుపుగోలుగానే ఉంటుంది. ఎవరితోనూ పెళుసుగా, అహంకారంగా మాట్లాడదు. మాట్లాడే మాటల్లో, చెప్పేసమాధానాల్లో నమ్రత, అభిమానం ఉట్టిపడుతుంటాయ్.

కాని అతనికి నిర్మల ఎప్పుడూ, నిర్మలలాగా, లేక మరొక సాధారణమైన, అతను ఎప్పుడూ ఊహించని నిర్ణయించుకోని సాధారణ స్త్రీలాగా ఎప్పుడూ కనబడలేదు. నిర్మలలో శకుంతలే కనిపించేది. నిర్మలగూడా మరొక శకుంతల, మరొక వంచకురాలు. ఇటీవల అతను కొంచెంగా గ్రహించిన విషయం నిర్మల తన పరిచయంకోసం ప్రయత్నిస్తున్నది అనేది. ఇంతకుముందుగూడా అట్లా ఉండేదేమో తెలియదుగాని యిప్పుడు తెలుస్తున్నది. వాళ్ళ సీట్లుగూడా ఆ మధ్య క్రొత్తగా మార్చిన మార్పులో దగ్గరగా వచ్చినయ్యి. అతని సీటులో మార్పులేదు. ఆమె సీటులో మార్పువచ్చింది. తను ఇంతకుముందు, ఎప్పుడూగూడా ఆఫీసరుగదికి బైటగా కూర్చుంటాడు. ఇంతకుముందు ఆమెసీటు ఆ గదిలోనే మరొకమూల ఉండేది. మిగతావాళ్ళ సీట్లుగూడా మారినయ్యి. అతనికి ఆ విషయం పట్టలేదు. ఆ మార్పు ఎందుకో తెలియదు. అసలు ఆఫీసులో ఒక శకుంతల ఎందుకో తెలియదు. అతనికి అర్థంకాలేదు. నిర్మల తనకి టైపు చెయ్యడంలో వచ్చిన సందేహాలన్ని అడుగుతున్నది. అడగటానికి తరచు మాట్లాడుతున్నది. సందేహాలేకాక యింకా మాట్లాడుతున్నది. అతనికి మతి తిరిగిపోతున్నది. ఆ శకుంతల తననించి దూరంపోదు. ఇంతకుముందు పారిపోయినట్లు పోదలచుకుంటే తనే పారిపోవాలి. శకుంతలలు స్థిరం. వాళ్ళని కదల్చటానికి ఎవరికీ శక్తిలేదు. పోదలచుకుంటే ప్రసాదరావు పోవాలి. పోదల్చుకోపోతే శకుంతలలుచేత వెంటాడ బడాలి. గత్యంతరంలేదు. అంతే.

అతను విసుగ్గా, సహించలేనంతగా, ఇక ఎప్పుడూ ఏ విషయానికీ సమాధానం చెప్పను అన్నట్లు చూస్తాడు. అయినా ఆమె సందేహాలు అడగటటంమానదు. నిర్మలకీ, శకుంతలకీ ఏ విషయంలోనూ, ఎక్కడా పోలికలేదు ఒక్కచనువు తీసుకొని మాట్లాడటంలోతప్ప. ఆ చనువు వాళ్ళు తీసుకోబోవటంలో యిప్పుడు బాధ ఉంది. బాధాకరమైన స్మృతులు ఉన్నయ్. అది అతనికి చాలా యిబ్బందిగా ఉంది. నిర్మలకి అదేమీ పట్టదు కాని సందేహాలతో, ప్రశ్నలతో చికాకుచేస్తుంది. కాని తను సమాధానాలు యివ్వకతప్పదు. అంతా ఆఫీసుపని, అదితప్పదు. అది కర్తవ్యం. అప్పుడప్పుడూ, తనకూ, ఆఫీసుకూ, ప్రసాదరావులకీ, మానవజాతికీ, అన్నిటికీ అపకారంగా తప్పనిసరి అపాయంగా ఉన్న ఆ శకుంతలని గొంతుపిసికి చంపిపారెయ్యాలని

పించేంది. అట్లా ఎందుకు అనిపించేదో తెలియదు. కాని అనిపించినపుడల్లా సంబాళించుకుంటాడు. కాని అప్పుడప్పుడూ ఆ భావంరాకుండా చేసుకోలేక పోతున్నాడు. తను ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కాని ఒకపట్టాన సాధ్యంకావటంలేదు. నిర్మల తనకు చేసిన అపకారం ఏమీలేదు. అపకారం చేసిన శకుంతలని గొంతుపిసికి చంపిపారెయ్యనూలేదు. గొంతుపిసికి చంపిపారేద్దామనే భావమూలేదు. అతను ఆ విపరీత భావం వచ్చినప్పుడు సంబాళించుకుంటున్నాడు. రాకుండా ఎట్లా ఉంటుందో, ఎందుకు వస్తుందోగూడా తెలుసుకోలేకపోతున్నాడు.

అదీ యీ మధ్యనించే ఎక్కువ. అతను ఇంకొంచెం జాగ్రత్తపడ్డాడు. అతని జాగ్రత్త ఎక్కువైనకొద్దీ, నిర్మల ఇంకొంచెం సన్నిహితంగా రావటానికి ప్రయత్నిస్తుండటం, దాంతో అతనికి చికాకు, దానిలోనించి బయలుదేరే ఉద్రేకం, దాన్ని అణచుకుందామనే ఉద్వేగంఒక్కసారే వస్తున్నాయ్. అతనిలో ఏదో గర్జిస్తున్నట్లుంటున్నది. ఆ గర్జనలు వినపడే టప్పటికి అతనికి భయంవేస్తున్నది. ఆ గర్జించే దేదో తనని వశపరుచుకుంటే, తను దానికి వశుడై ఏంచేస్తాడో తెలియదు. ఆ వివేకమే అతనికి యిప్పుడు యింకా బాధాకరంగా ఉంది. ఇంతకు ముందు మనస్సుకి యింతలొంగిపోలేదు. తన హృదయం యిప్పుడు బలహీనమైంది. యింతకుముందు తన మనస్సు యిన్ని ఆలోచనలలో ఎప్పుడూ చికాకుపడలేదు. తనకు వచ్చిన యీ జ్ఞానం, ఆ సంఘటన తనని పూర్తిగా బలహీనుణ్ణి చేసినయ్య.

తను ఎక్కడో చదివాడు. చదువుతో, జ్ఞానంతో మానసికంగా బలహీనమైన తనలాంటి వాడే, తనకి జరిగిన సంఘటనలాంటిదే జరిగినపుడు, ఏమీ చెయ్యలేకపోయాడు. నిర్వీర్యుడూ నిస్తేజుడూ అయ్యాడు. తనజీవితంలో, తనకు అల్లాంటి సంఘటన జరిగేటప్పటికి తను పొత్తిగా అజ్ఞాని. ఈ విషయాన్ని గురించి ఏమీ తెలియని, ఏమీ చదవనివ్యక్తి. ఎక్కడో చదివిన గుర్తువచ్చింది. అట్టి జ్ఞానంలేని వ్యక్తి తనకు జరిగిన సంఘటనలాంటిది జీవితంలో జరిగినప్పుడు, ఆసహచరిని చంపేశాడు. చచ్చిపోయిన తర్వాతగూడా కసితీరక, కసితీరటం కోసం పొడిచి, పొడిచి, ఆఖపోయిన ఆ శరీరాన్ని గుచ్చివేశాడు. అప్పటికీ ఆ నెత్తురుచూస్తేగాని ఆవేశం తగ్గలేదు.

కాని తన విషయంలో మాత్రం విపర్యయం కనిపిస్తున్నది. కాస్తాకూస్తా విషయ పరిజ్ఞానం కలిగిన తర్వాత, కొద్దో గొప్పో చదివినతర్వాత, యిప్పుడు శకుంతలకాని నిర్మల తన దగ్గరికి వస్తేనే తనికి ఉద్రేకం, ఆవేశం కలుగుతున్నయ్. నిద్రాణంగా, అచేతనంగా పడిఉన్న తనమనస్సు హృదయం యిప్పుడు ఎందుకు మేలుకుంటున్నయ్యో, మేలుకొని ఏ పర్యవసానం తీసుకొస్తయ్యో తనకి తెలియటంలేదు.

అతనికి తెలియంది మరొకటి మిగిలిపోయింది. ఇన్ని ఊహలలోటీ, ఉద్రేకావేశాలతోటి నిర్మలవైపు వెర్రిగా, విచిత్రంగా చూసేవాడు. కాని అతనికి తనకళ్ళు, తనభావాన్ని వ్యక్తంచేస్తున్నయ్య అనేవిషయం మాత్రం యింకా తెలియదు. అదుపు దాటిపోతానని బెదిరించే హృదయాన్ని అదుపులో పెట్టే ప్రయత్నంలో అతనికి కళ్ళ విషయం గుర్తురాలేదు. చిన్నప్పటినుంచీ, ఎంతగానో శిక్షణయిచ్చిన అతని అవయవాలు అతనికి ఎదురు తిరుగుతయ్యనేది అతను యిప్పటిదాకా ఎప్పుడూ గుర్తించని విషయం.

ఆ రోజు ఆదివారం. ఆఫీసరు మధ్యాహ్నం రమ్మంటే తను వచ్చాడు. అప్పటికే నిర్మలవచ్చి టైపు చేసుకుంటున్నది. హెడ్‌గుమాస్తా, తను ఆఫీసరు పంపితేనే వెళ్తున్నాననీ, కొంచెం సేపట్లో వచ్చేస్తాననీ చెప్పివెళ్ళాడు. ఆఫీసరు లోపల గదిలో, క్రిందటిరోజు వచ్చిన యితర ఆఫీసర్లతో చర్చలు చేస్తున్నారు. అది అయితేగాని తనకి పనిఉండదు. తనకు హెడ్‌గుమాస్తాగూడా వెళ్ళిపోవడం, నిర్మల విసిగించే టైపుమెషీను నిర్మలా కలిసి తనని ఆ సెలవురోజు విసిగించటం అసలు నచ్చలేదు. అసలు అక్కడ ఆ శకుంతల ఉండటం, ఆ శకుంతల మాట్లాడటం, అన్నీ నచ్చని విషయాలే. కాని తను వాటిని ఏమీ చెయ్యలేని విషయాలు. దూరంగా, ఒకమూలగా ఉన్న డ్రాయరు ముందు కుర్చీలాక్కుని నిర్మల తనకి కనబడకుండా ఉండేట్లు, ఆఫీసరు గంటకొడితే వినపడేటంత దూరంలో, తను తెచ్చుకున్న పుస్తకం చదువుకుందామని వెళ్ళి కూర్చున్నాడు. కూర్చొని వుంటే గుర్తువచ్చింది. క్రిందటిరోజునే రావలసిన మనియార్డరు రసీదు తనుచూసి తీసుకోలేదని. పుస్తకం బల్లమీదపెట్టి మామూలుగా ఉత్తరాలు పడవేసే డబ్బాదగ్గరికి వెళ్ళిచూచాడు. కాని దాంట్లో ఏమీలేవు. ఖాళీగా ఉంది. తల పైకెత్తకముందే మాటలు వినిపించినయ్. "అవిగోనండీ ఆ బల్లమీద పెట్టాడు నిన్నటి ఉత్తరాలు" అన్నది నిర్మల.

అతను తలఎత్తి చూశాడు. నిర్మల తనని గమనిస్తున్నదన్నమాట. వెనకగా ఉండి చేస్తున్నపని అదన్నమాట. శకుంతలా అంతే, తనదైనందిన కార్యక్రమంలో ప్రతిదీ చూసి, గమనించి తనకు అనువుగా ఏర్పాటు చేసుకున్నది. ఒక్కసారి ఆమెవైపు తీక్ష్ణంగాచూసి, ఆమె చూపెట్టిన బల్లదగ్గరకువెళ్ళి ఉత్తరాలలో తనరసీదు లేకపోవటం చూసి వెనక్కువెళ్ళి తన పుస్తకం తీసుకొని చదువుకోటానికి కూర్చున్నాడు.

నిర్మల టైపుకొట్టటంలేదు. కావాలని ఆపేసిందో, లేక పనిపూర్తిఅయ్య ఆపిందో తెలియదు. తనుగూడా లేచి వెళ్ళి యిందాకటి ఉత్తరాలు పడేసిఉన్నచోట, చిందరవందరగా ఉన్నవాటినీ, అవి పడివున్న చుట్టుప్రక్కల ప్రదేశాలనీ, అక్కడ పుస్తకాలకిందగా యిరుక్కున్న మరికొన్ని ఉత్తరాలనీ అన్నీ బైటకులాగి చూసి, మిగతా ఫైళ్ళని యధా ప్రకారం సర్ది అతని రసీదు తీసుకొని అతనిదగ్గరకు వచ్చింది. అతను యిదేమీ గమనించలేదు. దగ్గరగావచ్చి అన్నది ఆ రసీదు అం

దిస్తూ, "దీనికోసమా చూస్తున్నారు ఆ ఫైలు క్రింద పడి ఉన్నది."

ప్రసాదరావు తలపైకెత్తి చూశాడు. చేత్తో రసీదు అందుకుంటూ చూశాడు. అతని చూపు అతను అనుకుంటున్నట్లు మామూలుగానే ఉంది. ఆమె అంది "ఏమిటండీ అల్లా చూస్తారు" ఈ మాటలు చాలా సంకోచంగానే అన్నది ఏమీ ధ్వనించకుండా. చిరునవ్వు మాత్రం తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ.

అతనికి ఆమెని తినేసేటంత కోపంవచ్చింది. తనజోలి, తన ఉత్తరాలజోలి, తనచూపు జోలి అన్నీకావాలి. ఆ మాటలు పైకే అన్నాడు. "నా ఉత్తరాలజోలి, నా జోలి, నా చూపుల జోలి మీ కెందుకు."

ఈ సారి ఆమెస్థిమితపడి నవ్వటానికి ప్రయత్నించింది. అన్నది, ఒక్కొక్కప్పుడు మీరు చాలాభయంకరంగా చూస్తారు నావైపు. నిజంగా భయంగూడా వేస్తుంటుంది.

జీవితంలో మొదటిసారి అతనికి తోచింది తన భావాలు బహిర్గతమౌతున్నట్లు. తను ఎంతో శిక్షణ యిచ్చిన అవయవాలు అయినకళ్ళు, తను చిన్నప్పుడు ఎవ్వరికీ, ఎప్పుడూ తన దారిద్ర్యం గూర్చి చెప్పనికళ్ళు, చెప్పవుఅని నమ్మకంగా విశ్వసించిన కళ్ళు, శకుంతలలాగే మోసం చేస్తున్నట్లు. అతనికి వెంటనే చెప్పటానికి ఏమీ తోచలేదు. లోపలినించి వాళ్ళు వచ్చే సూచనలుగానీ, తనని పిలిపించే సూచనలుగానీ, కనీసం హెడ్ గుమాస్తా వచ్చే సూచనగానీ, చివరికి ఆ శకుంతల దగ్గరుంటే వచ్చే అపాయంనించి విముక్తిపొందే సూచనగానీ ఏమీ కనబడలేదు. ఆమె అక్కణ్ణుంచి వెళ్ళిపోతుందేమో ప్రయత్నించటానికి అన్నాడు ముక్తసరిగా "థాంక్సు అండీ".

"మీరే క్షమించండి నన్ను. మీ ఉత్తరాలుతీసి అనవసరంగా మిమ్మల్ని కష్టపెట్టాను" ఆమె ఏమీ తనుడుకన్నట్లు గాకుండా వెంటనే సమాధానం చెప్పింది.

ఈసారి ఆమె ముఖంలోకి వింతగా చూశాడు. తను సంబాళించుకొని మామూలు మనిషి అయ్యాడు. తను సముదాచారంగూడా విస్మరించేటంత ఉద్వేగపడ్డాడు. మొదటనే ధన్యవాదాలు చెప్పిఉండవలసింది. అట్లాఅయితే ఆమె వెంటనే వెళ్ళిపోయేదేమో అనుకున్నాడు. ఆమె తనకి దగ్గరగా ఉండటం బొత్తిగా నచ్చలేదు. అన్నాడు. "ఏదో చికాకులోఉండి అన్నాను క్షమించండి" యీసారి సముదాచారం బాగా పాటించాల ననుకున్నాడు. "అది తెలుస్తూనే ఉంది. అంతచికాకు మనస్సులోనే ఉంచుకుంటే పిచ్చిఎక్కటమో, అసంగతమైన పనులు చెయ్యటమో చేస్తారట. అంత చికాకు మనస్సులోనే పెట్టుకోవటం ఎందుకు. మీరేమీ అభ్యంతరంలేకపోతే, నేను చెయ్యగలిగిందేమైనా ఉంటే చెప్పండి తప్పక చేస్తాను." అన్నది. మంత్రముగ్ధమైన రామచిలుక మాట్లాడినట్లు.

అతనికి శకుంతల కనిపించింది. విశ్వాసానికి అనర్హురాలైన శకుంతలే నిర్మలకూడా. అనవసర విషయాలు మాట్లాడుతున్నట్లు అనిపించింది. "క్షమించండి. అవన్నీ మీకు అనవసరం" అన్నాడు కరుకుగా, కటువుగా.

కాస్త నోరున్న మామ్మగారు, పంపుదగ్గర నీళ్ళు పట్టుకోవటానికి వచ్చిన మిగతా నల్గురుతో అనే మాటల ధోరణిలో అన్నది నిర్మల "నాకు భయం కలిగించేట్లు చూడటం మీకు అవసరమా ఏమిటండీ, అని అడగటం నాకు అనవసరమూనా. బాగుంది వరస"

ఆమె ముఖంమీద వేటిఛాయలూ పూర్తిగా పోకుండా రెండూ కలిపివున్న శుష్కహాసం నిర్లిప్తత, అతను చూడనూ లేదు, చూస్తే అతనికి అర్థంకానూకావు. అతనికి కనిపించింది తన మనస్సులో ఉన్న చికాకు ఒక్కటే. దానితోనే అన్నాడు. "నేను ఎప్పుడూ చూడలేదు, చూడను, నాకేంపని చూడటాని మీవంక"

ఈసారి ఆమె పక్కున నవ్వింది. నవ్వి హృదయం తేలిక చేసుకుంది. అన్నది. "ఆ మాట అంటే నమ్మేవాళ్ళు ఎవరూ ?"

అతనికి ఎవరో వెన్నుచరిచి చెప్పినట్లయింది ఒకపరమ సత్యం. తనమాటనిజంగా నమ్మరు. ఆమె మాటలే నమ్ముతారు. ఆమె తనతో మాట్లాడటానికి చేసిన ప్రయత్నం చూసిన ముసలి హెడ్‌గుమాస్తా చేసిన హెచ్చరిక గుర్తుకు వచ్చింది. అన్నాడు "అయితే యింకేం కానివ్వండి మూడోవాణ్ణి నేను"

అతను అన్నమాటలకు అర్థం ఆమెకు సుకరంగానే బోధపడింది. అంతా తనను గురించి అనుకుంటున్నారు, అని తనకు తెలిసిన విషయం, ఎవరితోనూ సాధారణంగా మాట్లాడని అతనికీ తెలిసింది. తను ఏవో చెప్పి యిప్పటికి యిద్దరికి ఉద్యోగాలు తీయించింది. తను మూడోవాడు అవుతాడన్నమాట. వాళ్ళు ఏం చేశారో, ఏం చెయ్యబోయారో, తనకు వాళ్ళకు, నమ్మకంవున్నవాళ్ళు భగవంతుడికీ తెలుసు. మిగతా ఎవరికీ తెలియదు. తప్పు ఎవరిదైనా దెబ్బతిన్నవాడి మీద జాలి ఎక్కువ ప్రపంచానికి, ఆ తప్పు తన ఎదుటగానీ, తనుకేగానీ జరగకపోతే ఆ విషయం ఆమెకు తెలుసు. ఆమెకళ్ళలో నీళ్ళుతిరిగి కొలకుల్లోకివచ్చి ఆగినయ్. అన్నది.

"మీరు అల్లాగే అనుకుంటున్నారా ? ఏవో అబద్ధాలుచెప్పి ఉద్యోగాలు తీయించేదాన్నని అనుకుంటున్నారా ?"

అతను ఆమెని గురించి అనుకున్నదానికీ, యీ సంభాషణకీ ఏమీ సంబంధంలేదు. ఆమెని గురించి ఎప్పుడూ యీ విషయం ఆలోచించలేదు. యాదాలాభంగా అటుతిరిగిన సంభాషణలో ఆ ప్రసక్తి వచ్చింది. అతను అనుకోలేదు. ఆమెగూడా అనుకోలేదు.

అప్పటికే స్థిమితపడ్డ అతనికి ఆమెమాటల్లోని బాధ కొంత అర్థమైంది. తను అనుకోనివిధంగా, మాటలు బైటికి వచ్చి ఎదటివాళ్ళకి బాధకలిగిస్తున్నయ్. అతను జరిగిందానికి

తన బాధ్యతలేదని తెలియచేయటానికి, ఆ సంభాషణ అంతటితో పూర్తి చేయటానికి అన్నాడు" "అబ్బే నేను ఏమీ అనుకోలేదండీ". ఆమె అతను అన్నమాట వినిపించుకున్నట్లులేదు. తనమీదవడ్డ నిష్టూరాన్ని తొలగించుకోవటానికి, మాటలు బైటకి వస్తున్నట్లు, మాట్లాడింది.

"తప్పనిసరై మీ నలుగురిలోకి వచ్చినా, గౌరవంతో కాలం గడుపుకుందామనుకునే ఆడపిల్లని నాశనం చేద్దామని ప్రయత్నిస్తే ఎవ్వరికీ ఏమీ తప్పుకనబడలేదు. నా పరువు నేను కాపాడుకుందేదానికి నేను ప్రమాదకారి నైనాను. దీనికే యింత రాద్ధాంతమూనూ. అంతేనాఅండీ"

ఆమె నేపు చూడకుండానే ఉన్న ప్రసాదరావుకి యీ మాటలు స్పష్టంగానే వినిపించినయ్. తల పైకెత్తి చూశాడు. ఇందాకటినించీ కొలకుల్లో గూడుకట్టి, మార్గం వెతుక్కుంటూన్న ఆమె దైన్యం కట్టతెంచుకొని కారుతోఉంది. తన నిస్సహాయతవల్ల వచ్చిన దైన్యం, తనని అపార్థం చేసుకున్న తనచుట్టూ ఉన్న పురుషులకి, తనను సరిగ్గా అర్థం చేసుకోమని చెప్పటానికి అవకాశం దొరకనందువల్ల కలిగిన వేదన, తన అశక్తత అన్నీకలిసి ఆమెముఖంమీద పేరుకుపోయినయ్.

ఆఫీసరు అతనికోసం కొట్టిన గంట వినిపించింది. అతను బ్రౌటుబాటులో లోపలికి వెళ్లాడు. వెళ్తూ యీసారి ఆమె ముఖంలోకి ఒక్కసారి చూశాడు. కళ్ళు తుడుచుకొని బైపు మిషనుదగ్గరికివెళ్ళి కూర్చుంది. మిషనుమీద చెయ్యి అడ్డంగా పెట్టి, ఆ చెయ్యిమీద ముఖంఆనించి, మిషనులోకి, ముందు దూకివచ్చే ఆవేశాన్ని ఎదుర్కొని ఆపుతో, ప్రతిసారీ మొదటిసారికంటె ఎక్కువ వేగంతో ముందుకు సాగివచ్చే ఎత్తుగా చదునుగా ఉన్న గుండెలికి, అచేతనంగాఉన్న ఆ బైపు మిషను అంచు, "ఎందుకు విచారించి ఏం లాభం, మీ బ్రతుకే అంత, వాళ్ళ తత్వమేఅంత" అని చెప్పేసమాశ్వాసించే సమాధానం వింటున్నది.

తనవేపు చూసేటంత స్వాస్థ్యంలేని నిర్మలనీ, అడుగులచప్పుడుకి ఎవరాఅని తలఎత్తకుండా ఉన్న నిర్మలని, తను పూర్తిగానేచూస్తూ, అడావుడిగానే క్రిందికి వెళ్ళాడు. అట్లానే తిరిగివచ్చాడు. అప్పటికీ నిర్మల అట్లానేఉంది.

గదిలోనించి పెద్దగా మాట్లాడుకునే మాటలు, బూట్ల చప్పుళ్ళలో నిర్మల తలఎత్తిచూసింది. బైటికివెళ్ళే ఆఫీసర్లకి నమస్కారం చేసింది. తన ఆఫీసరు తల ఊగించి వెళ్ళాడు. తల ఊగించని ప్రసాదరావు గ్రుడ్లు అప్పగించి వాళ్ళ వెనకాలే వెళ్ళాడు. అతనికి యీసారి శకుంతల కనబడలేదు.

## 5

ఆ రోజురాత్రి అతను యీ సంవత్సరన్నరనించి అలవాటుగా చదువుతున్నట్లు పుస్తకం ఏదీ చదవలేదు. లైటువేసుకొనే మంచంమీద పడుకున్నాడు. మామూలుగా గుర్తుకు వచ్చే శకుంతల గుర్తురాలేదు. జాలిగా కన్నీరు కార్చేనిర్మల, నిరాశ్రయఐనదీ, తనలాగా కనీసం తన బాధ చెప్పుకోటానికి గూడా ఎవరూలేని నిర్మల, టైపుమిషనుమీద తలఉంచి, రోదించే మూగరోదనవినిపించింది. నిర్మలఅన్నమాటలూ గుర్తువచ్చినయ్. వాటినిగురించే ఆలోచించాడు. ఆలోచించి పడుకోబోయేముందు అనుకొని నిద్రపోయాడు— గౌరవమే ముఖ్యంగా కల నిర్మలలుగూడా ఉన్నారు. శకుంతల అప్పుడు మనస్సులో లేకపోవటంతో నిర్మలఅంటే ప్రసన్నతతోనే నిద్రపట్టింది.

తర్వాత జరిగిన రోజుల్లో అతను ఆలోచించాడు. ఉంగరాల జుట్టువాళ్ళు, విశాలమైన ఛాతీలవాళ్ళు, టెరలిన్ చొక్కాలవాళ్ళు, ట్వీడ్ ప్యాంటులవాళ్ళు ఎప్పుడూ ఉంటారు. వాళ్ళు అక్కర్లేనివాళ్ళుగూడా ఉంటారా అనిఅతని అనుమానం. ఆ విషయం తను చదివినపుస్తకాలలో ఎక్కడాలేదు. కాని వాళ్ళ గౌరవాలు లాక్కోకుండా జాగ్రత్తగాఉండి వాళ్ళ బారినించి తప్పించుకునేవాళ్ళు మాత్రం ఉన్నారు. నిర్మల ఏ తరహాకి చెందిందో తనకి తెలియదు. మంచిదోకాదో అంతకంటే తెలియదు. నిర్మలనించి, ఆమె గౌరవం లాక్కోటానికి ప్రయత్నించినవాళ్ళు ఉంగరాలజుట్టువాళ్ళు, విశాలమైన ఛాతీలవాళ్ళు టెరలిన్ చొక్కాలవాళ్ళు అవునోకాదోగూడా తనకు తెలియదు. తనకు తెలిసింది, బాగాతెలిసింది తన విషయమే. తను అట్లా ఉండాలని, ఏ స్త్రీ గౌరవాలు కొల్లగొట్టాలని తను ఎప్పుడూ అనుకోలేదు. కాని అనిలేకపోతే అసమర్థుడూ, అప్రయోజకుడూ, వ్యర్థుడూ అయ్యాడు.

తనకి యింకేవీ తెలియవు. తను గానుగెద్దు, తండ్రిలాగా జీవితాన్ని లాగటం, తండ్రులు కొడుకులకు తాము పొయ్యేటప్పుడు, ఉండగాగూడా ఆకాడి మెడమీదవేసేటట్లు, వేసి వెళ్ళాలనే విషయం తెలుసు. తనూ బహుశా ఆకాడి, తను కొన్నాళ్ళులాగి తర్వాత తనకొడుకుమీద వదిలివేసిపోతాడుగూడా. మిగతావాటికి తనకి టైంగూడా ఉండదు. పనిలేకుండా తీరిగ్గా ఉన్న కొద్ది టైం ఆఫీసరుకోసం ఎదురుచూస్తూ ఉంటానికీ యితర ఆలోచనలకీ సరిపోతుంది.

కార్యక్రమం మామూలుగానే సాగిపోతున్నది. పోతే నిర్మల అంటే వ్యగ్రభావంలేదు యిప్పుడు. ఆమెతో కొంచెం ఎక్కువగానే మాట్లాడుతున్నాడు. అతనిలోవచ్చిన ఆ కొంచెం మార్పు మిగతావాళ్ళకు గూడా తెలిసింది.

నిర్మల దగ్గరగావస్తే తనకి యిప్పుడు కోపం రావటంలేదు. ఉద్వేగం ప్రకోపించటమూలేదు. ఈ మధ్య ఆమె తీసుకునే మరికొంచెం చనువుకి తనలో మార్పుఏమీ కలగటంలేదు. సంతోషంగా ఉందోలేదో తెలియటంలేదుగాని ఒక్క విషయం మాత్రం తెలుస్తున్నది. శకుంతల యింతకుముందు అంత తఱచుగా గుర్తురావటంలేదు. గుర్తువచ్చినా యింతకుముందు అంతసేపు మనస్సులో ఉండటంలేదు. తనకుగూడా

బైటికి పంపటానికి యింతకుముందంత ఆలస్యం పట్టటం లేదు.

ఆ స్థానంలో తలుచు నిర్మల చోటుచేసుకుంటున్నది. నిర్మల నిర్మలలాగే, శకుంతలకు ఏమీ సంబంధంలేని నిర్మల లాగే ఉంటున్నది. ఆ చోటుతనుఇచ్చాడో తనే శకుంతలని మన స్సులోనించి బైటికి పంపివేసినంత త్వరగా నిర్మలను పంప కుండా తాత్సారం చేస్తున్నాడో, లేక ప్రయత్నంచేసి విఫలత పొందాడోగూడా ఆతనికి పూర్తిగా తెలియటంలేదు. అతనికి శకుంతలలా, నిర్మలగూడా తనజీవితానికి అక్కర్లేదు అని చేసుకున్న నిర్ణయం ఎక్కడా కనబడలేదు. తనలోవచ్చే యీ వింతమార్పు తనకు అర్థంకావటంలేదు. అర్థంచేసుకోవటం సాధ్యమయ్యే పనిగాకూడా కనబడటంలేదు. తనకు అర్థంకానివి చాలా మిగిలి ఉన్నాయ్. వాటిల్లో యిదిఒకటి.

తనకు అర్థమైన విషయం యీ మార్పువల్ల తనలో ఏదో, పూర్తిగా కొరతబడ్డ, ఆ పడ్డకొరత ఏమిటో తెలియని చోట, కొంత శాంతిపొందుతున్నాడు. ఆ శాంతి ప్రలోభం చేత నేమో తనజీవితానికి నిర్మలగూడా అక్కర్లేదు, అనుకోలేక పోతున్నాడు. నిర్మలగూడా శకుంతలే, శకుంతలే అవుతుంది అనుకున్న విషయంలో కొంతమార్పు వచ్చింది గనుక నేమో ఆమెని దూరంచెయ్యలేక పోతున్నాడు. రావద్దనలేకపోతున్నాడు.

అప్పటికే నిర్మల అతని గదికి చాలాసార్లు వచ్చింది. తనగది ఎక్కడో, తను ఏంతింటున్నాడో. అన్నీ ఆమెకు తెలుసు. తనసౌఖ్యం, తన ఉత్తరాలసౌఖ్యం ఎప్పుడు కలిగించుకుంది. అయితే ఆమెకి తననిగురించి చాలాతెలిసిఉండాలి. మొట్టమొదట ఆ విషయానికి ఆమెమీద కోపంవచ్చినా యిప్పుడివేవీలేవు. నిర్మలతన ఉత్తరాలు చదవలేదు. చూడలేదు. కేవలం తనను గురించి తెలుసుకోవటానికే ప్రయత్నిస్తున్నది. తనుగూడా తన పరిస్థితులు, మిగతావాటిని గురించి కొంత చెబుతున్నాడు. ఆ చెప్పటంలో తనకికొంత శాంతిఉంది. ప్రమాదంలేదు. తన అస మర్థతని గురించి శకుంతల వంచనని గురించీ ఎప్పుడూ చెప్పడు. ఎంతసేపుచెప్పినా తనబాధ్యతలను గురించి చెబుతాడు. బాధ్యతలేని వాళ్ళని నిశితంగా విమర్శిస్తాడు.

తనూ అప్పుడప్పుడు ఆమెయింటికి వెళ్ళాడు. ఆమె గూడా మిగతావాళ్ళకి పట్టని యదార్థమైన విషయాలు ఎన్నిటినో గురించి మాట్లాడుతుంది. అందులో తనికిముందు తెలిసినవి ఉండవు. ఇంటికి వచ్చినతర్వాత ఆ మాటలు, వాటి యాదార్థ్యం గురించి ఆలోచిస్తాడు. ఆమె చెప్పేవిషయాల లాగా, ఆమెచెప్పేపద్ధతి, అన్నీ తనకు బాగుంటున్నయ్యి. అప్పు డప్పుడు ఆమెనిగురించిగూడా ఆలోచిస్తాడు. ఆమెనిగురించి ఆలోచించటానికి, ఆమెతననిగురించి ఏమీ చెప్పలేదు. తను అడగనూలేదు.

నిర్మల ఎప్పుడో తనగదికి ఏదో మిషమీద వస్తుంది. అది తనకు పూర్తిగా అర్థమౌతున్నది. ఆమెరావటంవల్ల యిప్పుడు తనకు బాధగాని, విసుగుగాని, యిబ్బందిగాని లేకపోవ టంవల్ల కొంత తనబాధనించి విముక్తి, ఊరట కలుగుతున్నది గనుక ఆమెరావటం బాగానేఉంది అనిపిస్తున్నది. మొదట నిర్మల గదికి అంత తరచుగా రావటంగురించి ప్రక్కవాళ్ళు ఏమను కుంటారో అనుకున్నా, యిటీవల ఆ అభిప్రాయం గురించి అంత ఖాతరుచెయ్యటంలేదు. అక్కడ తననిగురించి అందరికీ మంచి అభిప్రాయం ఉంది. తరచుగావచ్చే, మగవాడింటికి నిర్భయంగావచ్చే నిర్మలమీదనే మంచి అభిప్రాయం లేక పోవచ్చు. బంగారంలాంటి తనని పాడుచేస్తున్నది అనుకోవచ్చు. పాడుచేసిన శకుంతలని గురించి ఏమనుకున్నారో తెలియదు. పాడు చెయ్యని, తనకి కొంతశాంతి, ఊరటయిచ్చే నిర్మలని గురించి అనుకుంటారనుకునేటప్పటికి ఆతనికి కొంతబాధ, ఆమెమీద సానుభూతి కలిగింది.

ఆమె రావటంవల్ల తను ఎట్లా హృదయం తేలిక పరుచు కున్నాడో, తనకి తెలిసినప్పుడు, ఆమె యింత నిర్భీతిగా వచ్చి తన హృదయం తేలిక చేసుకుంటుండాలి. అయినా ఆమెవేదనా, బాధ ఏమిటో తనకు పూర్తిగా తెలియదు. తెలుసుకోక పోవటం, సమంజసంకాదు అనిపించింది.

ఆమెకీ తనలాగా అర్థంచేసుకునే స్నేహితులులేరు. ఇన్నాళ్ళనించీ గూడుకట్టుకొని ఉన్నబాధ కొంత తగ్గుతున్నది. ఆమెగూడా అట్లాగేఉంది. ఏదో, మనస్సుకు నచ్చిన పిచ్చాపాటీ మాట్లాడుకుంటే మనస్సు ఎంతో తేలికపడుతున్నది. అదిగూడా లేకపోతే, నిర్మల చనువు తీసుకోకుండా ఉన్నప్పటి తనబాధ తనకి గుర్తుఉంది. ఇంతకుముందెవ్వరూ ఆ చనువు తీసుకోవటానికి ప్రయత్నించలేదు. తనుయివ్వడానికి ప్రయత్నించలేదుగూడా. ఎవరైనా సన్నిహితంగా వస్తే తనగురించి అంతా తెలుస్తుం దేమోనని భయంగూడా ఉండేది. ఇప్పుడు అదేమీలేదు. ఆ భయం ఉండక్కర్లేదు. తనకు తగిన జాగ్రత్తఉంది.

తనకిలా, నిర్మలనిగురించి, ఆమె బాధనిగురించి తెలుసు కుంటే, తను తెలుసుకుంటాడు అని చెపితే, ఆమె హృదయం తేలికపడుతుంది. ఆమె మనస్సుని కొంచెంగా విప్పి లోపల ఎంత బాధఉందో చూపెట్టినప్పుడే ఆమెకి లోపల బాధ వ్యథ ఉన్నయ్ అని తెలిసింది. కానితను ఎక్కువతెలుసుకొని, తనకు ఆమెచేసిన సహాయంలాగే తను ఆమెకు ఎప్పుడూ సహాయం చెయ్యటానికి ప్రయత్నంచెయ్యలేదు. అక్కడతను మానవత్వా నికే, విరుద్ధంగా ప్రవర్తించాడు. స్నేహధర్మానికే విరుద్ధంగా ప్రవర్తించాడు. చాలా విషయాల్లో సమాన భావాలుగలవాళ్ళు కనుకనే తాముకొంచెం దగ్గరగా వచ్చారు. అట్లా దగ్గరగా వచ్చినప్పుడు, ఆ ధర్మానికి ఉచితమైన మర్యాదతో ప్రవర్తించక పోవటం, ధర్మవిరుద్ధం, తనకి యిప్పుడిప్పుడే స్నేహధర్మం గూడా తెలుస్తున్నది. స్నేహమంటే అప్పుయిచ్చి పుచ్చుకోవ టం, మిగతా యిబ్బందుల్లో సాయపడటమేకాదు.

తను నిర్ణయం చేసుకున్న తర్వాత ఆమెతో మాట్లాడ టంలో, ఆమె విషయాలమీద ఆసక్తి చూపెట్టాడు. ఆమె

విచిత్రంగా చూసింది. అదీతనికి తెలిసింది. ఆమెతర్వాత అడక్కుండానే చెప్పింది తనవిషయాలుచాలా. కాని ఆ బాధలు, వ్యథా విన్న తర్వాత అతనికియింకా జాలివేసింది. తను అన్నీఅయి వ్యథపొందుతున్నాడు. కాని నిర్మల జీవితంలో యింకాఏమీ కాకుండానే వర్ణనాతీతమైన బాధకీ వ్యథకీ గురిఅవుతున్నది.

ఆమెకి అన్నతమ్ములులేరు. వాళ్ళంతా అప్పచెల్లెళ్ళు. ఉన్న నలుగురిలోనూ వాళ్ళనాన్న యిద్దరికి మాత్రం పెళ్ళి చేయగలిగాడు. అదిగూడా రిటైరైనతరువాత వచ్చిన, డబ్బులో ఇద్దరు అక్కయ్యల పెళ్ళిజరిగింది. కాని మిగతాయిద్దరికి పెళ్ళి చెయ్యటంకోసం, మిగిలిన ప్రావిడెంటు ఫండుగాని, సంపాదించేటంత ఓపికగాని ఏవీలేవు. అయినా కుటుంబం గడవటం కోసంవచ్చే కొద్ది పెన్షనుతోపాటు, షావుకారుదగ్గర లెఖలు వ్రాసిపెడుతూ కొంతతెచ్చి, యిబ్బందిగానే కాలం గడుపుతున్నాడు. ఇప్పుడు నిర్మల సంపాదనతో కొంత మెరుగుగానే ఉంది.

ఆయన నిర్మల పెళ్ళిచెయ్యగలగడం అసంభవం. బస్తీలో పెరిగింది గనుక స్కూలుఫైనలు ప్యాసయి, టైపు గూడా నేర్చుకున్నది. గనుక, అదికాస్త అక్కరకువచ్చి తనూ నాలుగురాళ్ళుతెచ్చి తండ్రికి కొంత సాయపడుతున్నది. కాని ఆ ఉద్యోగం చెయ్యటంలోగూడా కొంత బాధపడవలసి వస్తున్నది. ప్రతివాడికళ్ళూ తనమీదనే ఉంటయ్. ప్రతివాడూ, వివాహితుడూ, అవివాహితుడూ అనే విచక్షణలేకుండా నా అనే ఎవ్వరూలేని తను, కేవలం తమకోసమే, సిద్ధంగా ఉన్నదనేట్లు చూస్తారు. తను ఏమాత్రం అవకాశం యిచ్చినా తన గౌరవం మాత్రం పుచ్చుకొని, బాధ్యతమాత్రం అక్కర్లేనట్లు కనిపించారు.

తండ్రికి, తన గౌరవంతోపాటు, బాధ్యతగూడా పుచ్చుకునేవారు ఎవరుదొరికినా అయాచితంగావచ్చే అతనికి, బాధ్యత అప్పగించటానికి అభ్యంతరంలేదు. అల్లాంటి బాధ్యత పుచ్చుకోటానికి ఎవరికి యిష్టంవుందో, ఎవరు సంసిద్ధులో తండ్రి వెతకలేదు. వెతికి అల్లాంటివాణ్ణి పట్టుకోవటం ఆయనకు సాధ్యమయ్యే పనికాదు. అందుచేత అశక్తతతోటే, నిస్సహాయతతోటే, మౌనమైనఅంగీకారంతోటే ఆ బాధ్యత దైన్యంగా తన మీదనే పెట్టాడు. ఆయన, లేక ఇంకే తండ్రిగూడా ఆ పరిస్థితుల్లో వయసువచ్చి, పరిస్థితులు అర్థంచేసుకునే కూతురికి ఆ విషయానికి సంబంధించిన ఏ విషయమూ మాటల్లోపెట్టి చెప్పలేడు. ఇంకా తనకూతురి పెళ్ళికోసం ప్రయత్నం చేస్తున్నాననే అంటాడు. కాని ఆ విషయం, అందులో కష్టం తెలుసుకున్నవాళ్ళకి మాత్రం ఆయన మనసులో అంతరార్థం తెలియటానికి కష్టంఉండదు. నిర్మలకు ఆ విషయం బాగానే అర్థమైంది. ఇంకో విషయంగూడా ఆమెకి అర్థమైనట్లు చెప్పింది. తన పెళ్ళిఅయితే తండ్రికి ఆర్థికంగా కొంతబాధ కలుగుతుంది. కాని ఆ విషయమై ఆయనకు ఎక్కువ చింతలేదు. కూతురుకి పెళ్ళిఅయితే, ఆ కూతురు సంపాదించిపెట్టటంకంటె ఎక్కువ సంతోషిస్తాడు. నలుగురిలో గౌరవంగా తలెత్తుకుని తిరగవచ్చు.

అందుచేత తన భవితవ్యం తనే నిర్ణయించుకో వలసిన అవసరం, అంత చిన్నవయస్సులో నిర్మలమీద పడింది. బాధ్యతతోటే, వివేకమూ, వివేచనారెండూ వస్తయ్. అవివచ్చి తోడుపడ్డ నిర్మల, జాగ్రత్తగా కాలం గడుపుతూఉంది ఏ నిర్ణయం చేసుకున్నదో ఎవ్వరికీ తెలియకుండా. మానవ సహజమైన ఊహలతోటే, వయస్సుకు సహజమైన ఆశలతోటే తల్లి తండ్రీ చెల్లెలూ అనేబాధ్యతతోటే, జీవితాంతం జాగ్రత్తగా అల్లాగేఉండి కృంగి, కృశించి నశించిపోవటమో, లేకతన బాధ్యత ఒకరి చేతుల్లోపెట్టి, తండ్రిబాధ్యత భగవంతునిమీదనో, తన బాధ్యత తీసుకునే ఉదారుడిమీదనో కొంత ఉంచటానికి ప్రయత్నించటమో ఆమె నిర్ణయం చేసుకోవలసిఉంది.

కాని జాగ్రత్తగా ఉండి, కృశించి, బాధ్యత క్రిందపడి నశించిపోవటం సామాన్యమైన పనికాదు. చుట్టూఉన్న వాతావరణంగూడా, బైట వాతావరణానికి శ్రుతికలిపేటట్లు ఉన్నది. ఎప్పుడో ఒకప్పుడు లోపల ఉన్న ఆ స్థైర్యాన్ని తోసేసి ప్రకృతి లోపల ఉన్నా, బైటఉన్నా అంతాఒకటే, అని ఏకంచేస్తుందేమోనన్న భయంగూడా ఉంది. అట్లా జరగటానికి అవకాశం ఉన్న పరిస్థితుల్లో ఉంటూ, అట్లా జరిగినా సహించి, నలుగురిలో తలెత్తుకొని తిరగలేకపోయినా, బాధ్యతకోసం నాలుగు రాళ్ళు సంపాదిస్తూ ఆ తృప్తిలోపడి జీవించటమో, లేక ఆ యిబ్బందిరాకుండా, తను తనజాగ్రత్తపడటమో ఆమె నిర్ణయించుకోవాలి. ఆమె చేసుకున్న నిర్ణయమేదో ప్రసాదరావుకి పూర్తిగా తెలియకపోయినా, ఆమె యిబ్బందులూ, బాధ్యతలూ అన్నీ ఆమె సంభాషణలో తెలిసినయ్యి. ఆమెనుగురించి అతనికి జాలిఎక్కువైంది. ఆమెయందు గౌరవంగూడా మునుపటికంటె ద్విగుణీకృతం అయింది.

సూటిగాకాక, మాటల్లో వ్యక్తం చేసినట్లు అనిపించిన ఆమె నిర్ణయంగూడా అతనికి కొంత అర్థమైనట్లు తోచింది. తగుమాత్రం పరిచయం యిచ్చినవాళ్ళుగూడా, కలుగజేసుకొని బాధ్యతమాట మాత్రం రానివ్వకుండా, గౌరవం పుచ్చుకోవటం మాత్రం మాట్లాడారట. అట్లా మోడయిపోయే జీవితంగురించి జాలిపెట్టారట. బాధ్యతవిషయం తర్వాత చూసుకుందామన్నారట.

ప్రసాదరావు ఆమెదగ్గర్నుంచి చాలావిన్నాడు. కొంత అర్థం చేసుకున్నాడు. ఎక్కువ ఆలోచించాడు. దానితో ఆమె జీవితమలుపుల్లో మలచబడ్డ యాదార్థ్యం అతనికి కొంత గోచరించింది. తనూ ఒక్కొక్కప్పుడు తనని గురించీ, తన బాధ్యతల గురించి దాచకుండా చెప్పాడు. శకుంతల అతని మనస్సుకి యిప్పుడు రావటం మానేసి చాలాకాలమైంది.

వాళ్ళిద్దరూ చాలా సన్నిహితంగా వచ్చారు. అప్పుడప్పుడు కలిసి సినిమాకుగూడా వెళ్ళేవాళ్ళు. అది కంటబడ్డ మిగతా

గుమస్తాలు, అతని అదృష్టానికి సంతోషించినా, పూర్వపు అనుభవంతో, ప్రసాదరావు అక్కడ పనిచేసే ఆఖరిరోజుల్లో ఉన్నాడని అనుకున్నారు. ఆ ప్రమాదాన్ని గురించి అతనికి చెప్పి, అతన్ని ఆ ప్రమాదంనుంచి తప్పిద్దామని ఒకరిద్దరు అనుకున్నారుగూడా. కాని ప్రసాదరావు ఆ మాత్రం అవకాశం, ఆ విషయాలు నిస్సంకోచంగా మాట్లాడటానికి అవసరమైన చనువు ఎవ్వరికీ యివ్వలేదు. నిర్మలను గురించి యాదాలాభంగా వచ్చిన ప్రసంగాల్లో, ఆమెతత్వంగురించి యింతకుముందు స్థూలంగా చెప్పిన హెడ్ గుమాస్తాగూడా, యిప్పుడు ప్రసాదరావే దానిలో పార్టీ అయ్యేటప్పటికి, నిస్సంకోచంగా చెప్పలేక పోయాడు. చెబుతామని ప్రయత్నించినా అతను ఆ విషయం అంతటితో త్రుంచివేసేవాడు. అందుచేత ఆఫీసులో వాళ్ళంతా జాలిగా, ప్రసాదరావు ఉద్యోగం ఊడిపోయేరోజు ఏరోజు కారోజు వచ్చినట్లు, ఉద్యోగం పోకపోయేటప్పటికి, యింతకుముందు ఎప్పుడో జరగవలసినపని యింకా యింత ఆలస్యమైందేమిటా అన్నట్లు చూసి, మరుసటిరోజు జరుగవచ్చుఅనే తృప్తినిచ్చే సమాధానంతో, మరుసటిరోజుకోసం చూస్తూ గడుపుతున్నాడు గూడా.

ఆఫీసులోనూ, బైటాగూడా, ఎంతసన్నిహితంగా వచ్చినా, నిర్మలా ప్రసాదరావూ, తగినంత దూరంగానే ఉండేవాళ్ళు. కాని ప్రసాదరావులో యిప్పుడు యింకొంత మార్పువచ్చింది. అదీ తనకు తెలుస్తూనే ఉంది. అందమైన ఆమెశరీరం, కరుణామయమైన ఆమెజీవితం, బాధ్యతాయుతమైన ఆమె ఊహలు స్థైర్యం కోల్పోని ఆమెమనస్సు, అన్నీ అతన్ని కొంత ప్రలోభ పెడుతూనే ఉన్నయ్. ఇంతకుముందు శకుంతలను పురస్కరించుకుని, ఆడవాళ్ళందర్నీ గురించి ఆలోచించాడు. కాని యిప్పుడు నిర్మలను పురస్కరించుకొని నిర్మలనుగురించే ఆలోచిస్తున్నాడు. ఇప్పుడు నిర్మలతప్ప అతనికి శకుంతలాలేదు, మిగతా ఆడవాళ్ళని గురించిన ఆలోచనలూలేవు. కనీసం నిర్మల జీవితాన్ని బాధ్యత రహితంగా ఊహించిన ఆ యిద్దరు పురుష తోడేళ్ళని గురించి, గోపాలరావుల్ని గురించీ, ఉంగరాలజుట్టు వాళ్ళనిగురించి, విశాలమైన ఛాతీలవాళ్ళని గురించీ, టెరలిన్ చొక్కాలవాళ్ళని గురించిగూడా యిప్పుడేవీ ఊహలు రావటం లేదు.

నిర్మలను గురించి ఏకాంతంలో ఆలోచించినప్పుడల్లా అతనికి ఒక్కసందేహం మిగిలిపోయేది. నిర్మల ఆ యిద్దర్లో ఎవరినైనా ప్రేమించిందా అని. ఈ ప్రశ్న అతన్ని కొంత చికాకు పరిచిందిగూడా. ప్రేమించి ఉండదు, అని సమాధాన పరుచుకున్నాడు. ప్రేమించి ఉండేవాళ్ళిద్దర్లో ఎవరూ అక్కడ ఉండకుండా ఉండే అవకాశం కలిగేదిగాదు. నిర్మల తనకు యింత సన్నిహితంగా ఉండటానికి అవకాశం అంతకంటే కలిగేదికాదు. ఈ సమాధానం చెప్పుకున్నప్పుడల్లా అతనికి చాలా తేలికగా ఉండేది మనస్సు.

అప్పుడప్పుడు ఆమె తనను ప్రేమిస్తున్నదేమో అవే భావంగూడా వచ్చేది. అది వచ్చినప్పుడల్లా కొంత సందేహాన్ని వెంటబెట్టుకొని వస్తుంది. విశ్వాసాన్ని వెంటపెట్టుకునివస్తే బాగుండు ననుకున్నాడు. అప్పుడు తనదగ్గర లేనట్లు తెలిపిన వన్నీ, యింతకుముందు తనవేనని లిస్టు వ్రాసిపెట్టుకున్న వన్నీ మరొకసారి మననం చేసుకునేవాడు. అప్పటికీ, యిప్పటికి ఆ లేనివి తనదగ్గర లేకుండానే పోయినయ్. ఈ మధ్య క్రొత్తగా వచ్చినట్లు కనబడలేదు. తనికి ఉంగరాలజుట్టు, విశాలమైన ఛాతీ, టెరలిన్ చొక్కా, యివేవీలేవు. దీంతో నిర్మల తనని ప్రేమించటంలేదని నిర్ధారణగా తేలిపోయింది. ఆ విషయం అంత నిర్ధారణగా తేలిపోయినప్పుడు, అతనికి సంతోషంగా, ముందు ఉన్నంత శాంతంగాలేదు. ఆ విషయం తెలుస్తున్నది.

తనదగ్గర లేనివాటినే ఆమె కోరుతున్నదనిగాని, లేకపోతే అవిపూర్తిగా అక్కర్లేదనిగాని, అవి లేకపోవటమే ముఖ్యం అనిగాని ఏ విషయం నిర్ధారణగా తేలలేదు. ఆడవాళ్ళకి అవి ముఖ్యం అనేవిషయంలో అతని అభిప్రాయమూ మారలేదు. ఇంతకుముందు వాళ్ళను ప్రేమించిందోలేదో, అని తెలుసుకొని నిర్ధారణ చేసుకుంటే ప్రేమిస్తే యివన్నీ వాళ్ళకి ఉన్నయ్యోలేవో తెలుసుకోగలిగితే అప్పుడు ఆమె వాటిని చూసే ప్రేమించిందో, అవిలేవని తెలిస్తే లేకపోతే ప్రేమించలేదో తెలుసుకోవచ్చు. ఈ విషయం, యింతకుముందు వాళ్ళ విషయం తెలిస్తే కనీసం ఆరాటపడుతున్న తన మనస్సు తేలికపడుతుంది.

అందుచేతనే ఒకరోజు ప్రసంగంలో ఆ విషయం సూటిగానే అడిగేశాడు. ఆమెలాగా డొంకతిరుగుడు మాట్లాడటం తనకు చేతకాదు. "మీరువాళ్ళలో ఎవరినో ఒకర్ని నిజంగా ప్రేమిస్తే విశ్వసించలేకపోయారా మీ బాధ్యత తప్పక తీసుకుంటారని" అన్నాడు.

ఆమె అతనిముఖంలోకి సూటిగా చూసింది. అయినా ఆ ప్రశ్న ఏం ఉద్దేశించివేశాడో అర్థంకాకపోయినా చెప్పింది "కాలుతుంది అనితెలిశాకగూడా కాలదులేఅనే భరోసాతో నిప్పుపట్టుకోమంటారా. భలేవారేమీరు"

"అయితే మీలో ప్రేమ లేదన్నమాట అన్నాడు. లేదు అనే సమాధానం ఆశిస్తున్నట్లు

# సద్గమయంలో

"ఊహుఁ, నాకులేదు. నాకు తెలిసింది. క్షేమంగా ఉండేది బాధ్యత ఒక్కటే. మీ రనుకునే ప్రేమ నాదగ్గరలేదు. ప్రేమఅనే వ్యామోహంకోసం బాధ్యతగూడా వదిలేసుకునేటంత ప్రేమలేదు." ఆమె ఆవేశంగానే చెప్పింది. అతను మొదటిసారి తనని గురించి తెలుసుకోవాలని ఉత్సాహంచూపించినప్పుడు, ఆ అవకాశం సద్వినియోగం చేసుకుంటున్నాను అనేట్లు, ఆ అవకాశంపోతే మళ్ళీ అల్లాంటి అవకాశం వస్తుందో రాదో అనేట్లు చెప్పింది.

ఆ సమాధానం అతనికి చాలాబాగుంది. తనలో ఉన్నఒక్క గుణం భాసించి, వికసించి, దానిఉత్కృష్టత నిర్మలలో ద్యోతకం అయింది. నిర్మల తనను ప్రేమిస్తున్నది. అనేభావం అతనికి యీసారి సందేహంతోకలిసికాకుండా విడిగానే వచ్చింది. ఏమాటలైతే మనకు అత్యంతానందాన్ని యిస్తయ్యో ఆవేమళ్ళీ, మళ్ళీ, వినటానికి ఉత్సహిస్తాము. నన్నువెూరు అన్నా ఆ మాటలు మళ్ళీ వినపడకపోతే, కనీసం ఒకసారి, వీలైతే ఎక్కువసార్లు మనస్సుచేతనైనాసరే చెప్పించుకొని ఆనంద పడతాము.

అతను అన్నాడు "అయితే త్యాగశీలమైన ప్రేమ లేదన్నమాట మీలో". అతనేదో పుస్తకాల్లోనించి చదువుతున్నట్లు అనిపించింది. ఆమె వింతగా అతనివేపుచూసి, ఒకసారి నవ్వి అన్నది "అందుకే యిట్లు బ్రతుకుతున్నాను నలుగురిలో తలెత్తుకుని. పోనిద్దురూ ఆ విషయం. ఇంకేమన్నా చెప్పండి."

సాధారణంగా ఆమె ఎక్కువ మాట్లాడుతుంది. కాని ఆరోజు తనే ఎక్కువగా మాట్లాడేటంత ఆనందంలో ఉన్నాడు. అతనికి ఆ విషయం వదల బుద్ధిపుట్టలేదు. తన బ్రతుకుకంతా పరమావధి అయిన బాధ్యతని ప్రేమించేవ్యక్తి, తనలాగా మరొకరు ఉన్నారు. ఆ విషయం తెలిసినప్పుడు కలిగిన తన్మయత్వంలో, అతనికి మరొకటి స్పష్టంగా తెలిసింది. నిర్మల తనలో ఉన్న ఆ ఒక్క విషయం గమనించింది. నిర్మలకు తన దగ్గర లేనివేవీ అక్కర్లేదు. తనదగ్గర ఉన్న ఒక్కదానికే విలువ యిచ్చింది. ఇంతకుముందు తను విలువలేనిదీ అని శకుంతలచేత చూపెట్టించుకున్నది, ఎంతో విలువైనదీ, అలభ్యమైనదీ, అందరిదగ్గర దొరకనిదీ అనిచెప్పింది నిర్మల. ఆ విషయం స్పష్టమైన మాటల్లో చెప్పకపోయినా, తనకు మిగతా అర్థమయిన విషయాల్లాగా, యిదీ అర్థమైంది.

అతను మళ్ళీ "స్వయంగా పోషించుకోలేని తల్లిదండ్రుల్ని వదిలిపెట్టి, స్వలాభం చూసుకోవటం బాధ్యతా" అన్నాడు.

ఆ విషయాన్ని గురించి సూటిగా తన అభిప్రాయం వ్యక్తంచెయ్యటానికి సంకోచిస్తున్నట్లు, అయినా తప్పనిసరి ఐనట్లు ఒకప్రక్కగా తలతిప్పి పాఠం ఒప్పగించినట్లు చెప్పింది "లేదు, వాళ్ళ బాధ్యత, వాళ్ళు నిర్వహించుకోలేని బాధ్యతనించి వాళ్ళని విముక్తుల్ని చెయ్యటానికి ప్రయత్నిస్తున్నాను. అది స్వలాభం ఎట్లా అవుతుంది. నామీద పడే నిందలతోటో, నీలాపనిందలతోటో నామూలకంగా వాళ్ళకి అప్రతిష్ట వచ్చి, బ్రతికినన్నాళ్ళు వాళ్ళు నేనుగూడా వ్యథపడటం కంటె యిది బాధ్యతాయుతంగా వ్యవహరించటంకాదూ."

ఇంక ఎక్కువ చెప్పనూలేకపోయింది. అతనివైపు చూడనూలేకపోయింది. తప్పనిసరిఅయి బాధతోచేస్తాడు అనే ఆశతో మగడాక్టరుకు శరీరంఅంతాచూపే ఆడరోగిలాగా, సంకోచంతో కుంచించుకుపోయి, లేచి "వస్తానండి" అనిచెప్పి అతనివైపు చూడకుండానే వెళ్ళిపోయింది. ఎందుకు వెళ్ళిపోతున్నదో తెలియక, ఆగమనలేక, ఆగమంటే ఆగుతుందో లేదో తెలియక, మళ్ళీ వస్తుందోరాదోగూడా ఊహగూడారాక, ఆమె వెళ్ళినవైపుకే చూస్తూ ఉండిపోయాడు.

(సశేషం)

పదలాలిత్యము తర్కశుద్ధియును, శబ్దస్థైర్యమున్ మంగళా
స్పద భావంబును రాజ్యయోగ్యతయు దోషస్ఫూర్తి రాహిత్యమున్
సదలంకార విశేషముం గలిగి విశ్వప్రాణ సౌభాగ్య సం
పద మైతేజియఁ బోలె గ్రాలవలదా పద్యంబు హృద్యస్థితిన్.

—పెదపాటి సోమయ కేదార ఖండము.